

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెప్పిన మాట ప్రకారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పెంపు, రూ. 3 వేల నుంచి రూ. 4 వేలు పెంచడంతోపాటు మూడు నెలల బకాయిలు కలిపి రూ.7 వేలు అందిస్తున్న సందర్భంగా సిఎం నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆదివారం రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో వేలాదిమంది కార్యకర్తల సమక్షంలో రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ నిర్వహిం చారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర అన్నిరకాలుగా దివాళా తీసిందన్నారు. సమర్ధుడు, రాజనీతిజ్ఞుడు నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నారన్నారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పండుగ..!

- 3.19 లక్షల మందికి రూ.218 కోట్లు
- ఉదయం 6 నుంచి ఇంటి వద్దకే సిబ్బంది
- మంత్రులు, ఎంఎల్‌ఎలుతోపాటు కూటమి నేతలు
- 8 వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీకి నేడు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని ప్రతి లబ్ధిదారుని ఇంటికి నేరుగా వెళ్లి ఉదయం 6 గంటల నుంచే పంపిణి చేయనున్నారు. ఇందులో కోసం సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది, అంగన్‌వాడీలు సుమారు 8 వేల మందిని వినియోగిస్తున్నారు. మంత్రులు, ఎంపి, ఎంఎల్‌ఎలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇదే సమయంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఇంటింటికి వెళ్లాలని పార్టీ నేతలు ఆదేశించారు. జిల్లా వ్యాపితంగా 3,19,961 మంది పింఛన్ దారులకు రూ.218 కోట్ల 78 లక్షలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటి వరకు వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పంపిణి చేస్తుండగా ఇప్పుడు సచివాలయ సిబ్బంది ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి నెలా పింఛన్ రూ 95 కోట్లు ఇస్తుండగా, నేడు ఒక్క రోజే రూ 218 కోట్ల ఇవ్వనున్నారు. ఆగస్టు నెల నుంచి రూ 125 కోట్లు ప్రతినెల ఖర్చు చేస్తారు . ప్రతి ఇంటికి వెళ్లి ఒక్కరోజులో పింఛన్లు పంపిణి చేయడానికి ఏర్పాట్లు చేశామని డిఆర్‌డిఎ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎన్‌టిఆర్ ఫించన్ పండుగకు ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారమే జిల్లా వ్యాపితంగా పంపిణి చేయడానికి రూ 218 కోట్లు బ్యాంకుల నుంచి డ్రా చేసి, ఆయా కేంద్రాలకు అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి నేతలు పింఛన్‌ను భారీగా పెంచుతామని ప్రకటించారు. మూడు నెలల అలవెన్స్ కలిపి ఇస్తున్నారు. కూటమి ఘన విజయం సాధించడంతో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ ఇవ్వడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందుకోసం డిఆర్‌డిఎ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకే ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లాలి. ఆధార్ బయోమెట్రిక్ ఆదారంగా నగదు అందజేస్తారు. సచివాలయ సిబ్బంది 6500 మంది, వివిధ శాఖల నుంచి 1500 మందిని తీసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్స్, సీనియర్ విఆర్‌ఎలు, 100 మంది అంగన్ వాడీ వర్కర్లను దీని కోసం ఉపయోగిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి 50 మంది లబ్ధిదారులను కేటాయించారు. సిబ్బందితోపాటు మంత్రులు, ఎంపి, ఎంఎల్‌ఎలు కూడా ఆయా నియోజకవర్గాల్లో పాల్గొననున్నారు. మంత్రి పి. నారాయణ నెల్లూరు కార్పొరేషన్‌లోనూ, ఆనం రామా నారాయణరెడ్డి ఆత్మ కూరు మున్సిపాలిటీ, పలు గ్రామాల్లో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు రూరల్, ఆత్మకూరు ప్రాంతాల్లో పాల్గొంటారు. అన్ని నియో జకవర్గాల్లో ఎంఎల్‌ఎలు హాజరు కానున్నారు. తమ కూటమి ప్రభుత్వం చెప్పింది చేసిందని చెప్పడానికి కూటమి నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో టిడిపి, జనసేన, బిజెపి నేతలు ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం ఇస్తుందనే విషయం చెప్పిలా చూస్తున్నారు. దీనిని తమ పార్టీ మైలేజ్‌కు ఉపయోగించుకోవాలని చూస్తున్నారు.

రూ 3.19 లక్షల మంది, రూ 218 కోట్లు...!

జిల్లా వ్యాపితంగా 3,19, 961 మంది పింఛన్‌దారులకు రూ 218 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఇందులో వృద్ధులు, 1,73,064 మంది, వితంతువులు 74,547 , దివ్యాంగులు 33489, ఒంటరి మహిళలు 11133 ,మత్స్యకారులు 5023, చేనేత 3246, డప్పు కళాకారులు 3512 , సైనిక్ వెల్ఫేర్ పింఛన్ కళాకారులు, సాంప్రదాయ కళాకారులు; వీరందరికి గత ప్రభుత్వంలో మూడు వేల అందజేశారు. ప్రస్తుతం దీనిని రూ 4వేలకు పెంచారు. అరియర్స్‌తో కలిపి నేడు రూ 7 వేలు పంపిణి చేయనున్నారు. దివ్యాంగులు, లెప్రసీ వారికి గతంలో రూ 3 వేలు పింఛన్ ఇస్తుండగా దానిని ప్రస్తుతం రూ 6 వేలకు పెంచారు. పెరిగిన మూడు వేలకు మూడు నెలలకు రూ 9వేలు, రూ 15 వేలు ఇస్తారు. అనారోగ్యంతో కుర్చికే పరిమితమైన వారికి, ప్రమాదం దెబ్బతిని మంచంపట్టిన వారికి గతంలో రూ 5 వేలు ఇస్తుండగా, దానిని రూ 15 వేలకు పెంచారు. ప్రస్తుతం ఇచ్చే రూ 15వేలతో కలిపి , మరో 30 వేలు మొత్తం రూ 45 వేలు అందజేస్తారు. కిడ్నీ, లివర్, గుండె మార్పిడి,తో పాడు మరో మూడు రకాల వ్యాధి గస్తులకు గతంలో రూ 5 వేలు ఇస్తుండగా, దానిని రూ 10 వేలకు పెంచారు. ప్రస్తుతం ఇచ్చే రూ 10 వేలు, అలవెన్స్ రూ 15 వేలు కలిపి రూ 25 వేలు అందజేస్తారు. డయాలసెస్, ప్రభుత్వ, ప్రవేటు చోట చేయించుకునే వారికి, తలసీమల రోగులకు గతంలో రూ 10 వేలు ఇస్తుండగా దానిని అలాగే కొనసాగిస్తున్నారు.

వస	ఎవరికి ..	పాతది	కొత్త పింఛన్
1.	వృద్ధులు, వితంతువులు	3,000	4000
2,	దివ్యాంగులు, లెప్రసీ	3,000	6000
3	ప్రమాదంలో మంచంపై ఉంటే	5000	15000
4	కిడ్నీ, లివర్, గుండె మార్పిడి, ఇతరులు	5000	10000
5	డయాలసిస్, ఇతరులు	10,000	--

ఇంటి వద్దకు వెళ్లి ఇస్తాం ..
సాంబశివారెడ్డి, పీడీ

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్‌టిఆర్ పింఛన్‌ను నేడు ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికి వెళ్లి అందజేస్తాం.. ఎక్కడా గ్రూపులకు ఇవ్వడం కుదరదు. సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదు. బయో మెట్రిక్ ఆధారంగా నగదు చెల్లిస్తాం. ఒక్క రోజులో 100 శాతం పూర్తిచేసేలా లక్ష్యం పెట్టుకున్నారు. ఇంటి వద్ద లేకున్నా , బయోమెట్రిక్ ఇబ్బందులున్నా మరుసటి రోజే అందజేస్తాం..

టిడిపిలో బదిలీల సిగపట్లు..!

- మంత్రుల అసంతృప్తి రాగం
- అంతా తామేనంటున్న ప్రజా ప్రతినిధులు
- పార్టీ నేతల ఆగ్రహాజ్వాలలు
- మిత్రలపక్షాలది మరో గోల

రాష్ట్రంలో మార్పు కోసం ప్రజలు అఖండ విజయం ఇచ్చిన ఎన్‌డిఎ కూటమిల్లోనూ, టిడిపి ప్రజా ప్రతినిధుల, నేతల మధ్య అప్పుడే సిగపట్లు మొదలైనట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవకు ముందే ఎవరు గొప్ప ? అనే అంశంలో మంత్రులు, నేతల మధ్య కాస్త అసంతృప్తి కనిపిస్తున్నట్లు సమా చారం. అభివృద్ధి పనులకు ఇంకా ఎలాంటి ప్రణాళిక జరగలేదు. పింఛన్లు, మెగా డిఎస్‌సి, భూహక్కు చట్టం రద్దు, స్కిల్ డెవలప్‌మెంట్ ,అన్నక్యాంటీన్లు పునరుద్ధరణ వేగంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోడానికి మంత్రులు, ఎంఎంఎల్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. పోస్టింగుల కోసం పార్టీ నేతల వద్దకు కొందరు అధికారులు క్యూ కడుతున్నారు. మాకు మేమే బాస్‌లం, అంటూ కొందరు వ్యవహరిస్తుండడంతో వివాదం జరుగుతున్నట్లు తెలుస్తోంది. బదిలీల కోసం జనసేన, బిజెపి నేతలు మేం చెప్పినవి కొన్ని చేయాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.. మరి కొందరు అలక పూనినట్లు తెలుస్తోంది..

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వంలో మొండిగా వ్యవహరించి, పాలనలో ఎవరి దారి వారిదే అన్నట్లు నడుచుకోవడంతో భారీ నష్టం జరిగిందని ఆపార్టీ నేతలు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, పార్టీ నేతల మధ్య సమన్వయం లేకపోవడం, అభివృద్ధి పనులు జరగకపోవడం..ఏ నియోజ కవర్గానికి వారే బాస్‌లుగా మారి, అన్ని దందాలు చేశారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వంలో మార్పు ఉంటుందని అందరూ భావిస్తున్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా ఐదు ప్రధాన అంశాలపై సంతకాలు చేసి, అమలు చేస్తున్నారు. టిడిపిలో గతంలో ఎప్పుడు లేని వింత పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. పార్టీ ఏర్పాట్లు నుంచి ఎన్నికలు పార్టీ జిల్లా కార్యాలయం కేంద్రంగా సాగేవి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కార్యాలయం కేవలం ఉత్సవ విగ్రహంగానే ఉండ పోయింది. ఎంపి, ఎంఎల్‌ఎల కార్యాలయాల నుంచే అంతా సాగింది. పార్టీది ఏమీ లేదు అంతా తమ బలంమీదే గెలిచాం అనే దొరణికి కొందరు ప్రజా ప్రతినిధులు వచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు అనుకూలమైన, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, తాము చెప్పినట్లు వినే అధికారుల కోసం ప్రయత్నాలు చేస్తారు. పోస్టింగ్‌లు వేయించుకుంటారు. 2014 ఎన్నికల్లో మంత్రులుగా పి. నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉన్నప్పటికీ బదిలీలు, మంచి అధికారుల ఎంపిక, అంతా సమన్వయం చేసుకునే బాధ్యత పార్టీ సీనియర్ నేత బీద రవిచంద్రకు అప్పగించారు. మంత్రులు బిజీబిజీగా ఉన్నప్పటికి విభేదాలు లేకుండా పని జరిగిపోయింది. ఇప్పుడు పార్టీ అధికారంలోకి రావడంతోపాటు, బిజెపి, జనసేన పార్టీలు కలిసి ఉండడంతో వారిని కలుపుకుపోవాలని చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రతి ఎంఎల్‌ఎ వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంత వరకు బాగున్నా అధికారుల బదిలీల విషయంలో ఆపార్టీలో అసంతృప్తి నెలకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ఎంపి వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి ఇంట్లో తాడేపల్లిలో సమావేశం నిర్వహించారు. ఎవరి నియోజకవర్గానికి వారే బాస్‌లని, బదిలీలు అంతా చూసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు సమా చారం. ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు అధికారిక పదవులు లేకున్నా, పార్టీలో కీలకంగా ఉన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిల్లాలో నాయకులు, కార్యకర్తలకు అండగా నిలిచారని పార్టీనేతలు చెబుతారు. తమకు పదవులు లేకున్నా పార్టీ గెలవాలనే ఉద్దేశ్యంతో ఎవరికి సీట్లు ఇచ్చినా పనిచేశారని చెబుతున్నారు. కొందరు అధికారులు బీద రవిచంద్రను కలిసి తమ బదీలకు సంబందించి విజ్ఞప్తి చేయడంతోపాటు, సిపార్సులు చేసు కున్నారు. జిల్లా అధికారుల తోపాటు, మండల స్థాయి అధికారులు ఇందులో ఉన్నారు. మంత్రులు, ఎంఎల్‌ఎలతో మాట్లాడి చెబుతాం అన్నట్లు సమాచారం. ఈ విషయం మంత్రుల వద్దకు వెళ్లినట్లు తెలిసింది. ఇటీవల బారాషాహీద్ దర్గ వద్ద జరిగిన సమావేశం అనంతరం మంత్రులు మధ్య ఆసక్తికర సంభాషణలు జరిగినట్లు సమాచారం. " మేం మంత్రులుగా ఉంటే.. ఆయన పెత్తనం ఏమి టని, అందరూ అక్కడకు వెళ్తే మనం ఎందుకు ఇక్కడ, " అంటూ ఒక మంత్రి చెప్పడంతో మరో మంత్రి దానికి తందాన అన్నట్లు తెలిసింది. ఇది ఎట్టి పరిస్థి తుల్లో జరగదని, ఏం చేయాలో చెద్దాం అన్నట్లు మాట్లాడినట్లు సమాచారం. దీంతో నేతలు, ప్రజా ప్రతినిధుల మధ్య కొంత గ్యాప్ వచ్చినట్లు కనిపిస్తోంది.

టిడిపి నేతల ఆగ్రహం...!

అధికారుల బదిలీల విషయంలో కొందరు ప్రజా ప్రతినిధుల వ్యవహారిశైలీ టిడిపి నేతలు, కార్యకర్తలకు ఆగ్రహం తెప్పిస్తోంది. జిల్లాలో అనేక మంది పార్టీకి రాయల్‌గా పనిచేస్తున్నారు. ఎంపి ఎంఎల్‌ఎ పదవులు రాకున్నా పార్టీనే ఉంటూ ముందుకుపోతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు, దాడులు, ఆస్తినష్టం వంటివి చూశారు. ఎన్నికల సమయానికి వైసిపి, బయట నుండి వచ్చిన వారు ఎంపి, ఎంఎల్‌ఎ సీట్లు సాధించుకున్నారు. చంద్రబాబు నాయుడు గెలుపే లక్ష్యంగా టిడిపి నేతలకు సీట్లు రాకపోయినా పనిచేశారు. . వైసిపి నుంచి నేతలు రావడంతోపాటు అక్కడ ఉన్న కార్యకర్తలను తమ వెంట తెచ్చుకున్నారు. ఇప్పుడు ఎంపి, ఎంఎల్‌ఎలుగా గెలవడంతో టిడిపి నేతల స్థానంలో వైసిపి నుంచి వచ్చిన నేతల ప్రాధాన్యత పెరిగిందని, తమను కనీసం పట్టించుకోవడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ విషయంలోనూ బయట నుంచి వచ్చిన వ్యక్తుల ప్రాధాన్యత తప్పపార్టీ నేతలకు ఎలాంటి అవకాశాలు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయట నుండి వచ్చిన వైసిపి నేతలు అధికారం రాగానే సెట్ అయ్యారని , ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో నెలకున్న వివాదంతో కొందరు పార్టీ సీనియర్ నేతలు మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాము ప్రజా ప్రతినిధులం కాబట్టి మేం చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నారని, పార్టీకి ప్రాధాన్యత ఇవ్వడం లేదని మరికొందరు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి..

సచివాలయంలో తనిఖీ

గ్రుడ్లూరు : సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని డిఎల్ పిఒ కష్ణమోహన్ అధికారులను ఆదేశిం చారు. మండలంలోని మోచర్ల సచివాలయాన్ని ఆయన ఆది వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం ఉద్యోగులందరూ ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆయన తెలి పారు. ఎంపిడిఒ వెంకటేశ్వర్లు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు.

ఒత్తిడి లేని విద్యతో మెరుగైన ఫలితాలు

గుడ్లూరు : ప్రైవేటు పాఠశాలల విద్యా బోధన కంటే ప్రభుత్వ పాఠశాలలో ఒత్తిడి లేని విద్యతో మెరుగైన విద్యా బోధన చేసి మంచి ఫలితాలు రాబట్టాలని ఎంఇఒ కె శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని జానకంపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రధానో పాధ్యా యులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కాకర్లపూడి శ్రీనివా సరాజుకు స్థానిక జికె కళ్యాణ మండపంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం జరిగింది. జోనాలగడ్డ వెంకటాద్రి అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కిలారి వెంకటేశ్వర్లు, మాజీ ఎంఈఓ బండి సుబ్బారావు, మక్కిన రమేష్ మాట్లాడారు.

గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

వ్రలేటివారిపాలెం : వలేటివారిపాలెం విఆర్‌ఒగా పని చేస్తున్న సూరిబాబు(60) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు సూరిబాబు వలేటివారిపాలెం విఆర్‌ఒగా పనిచేస్తున్నారు. సూరిబాబు 30వ తేదీ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మతి చెందారు. సూరిబాబు ఎప్పటిలాగే భోజనం చేసి నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో గుండెల్లో నొప్పి రావడంతో స్థానిక ఆర్‌ఎంపి దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు అయినప్పటికీ సూరిబాబు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సూరిబాబు మతదేహాన్ని తన స్వగ్రామమైన పొదిలికి తరలించారు. సూరిబాబుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పరిశీలన

నెల్లూరు : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చు చేసిన వ్యయంపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల వ్యయ రికన్సులేషన్ సమావేశం నిర్వహించారు. వ్యయ పరిశీలకులు ప్రసాద్ దత్తాత్రేయ, కాంచన్ రామ్ మీనా, జ్యోతిమయి బైలంగ్ పాల్గొన్నారు..జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ తయారు చేసిన వ్యయ నివేదికలపై ఆయా పార్టీల అభ్యర్థులు ఎటువంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని జిల్లా వ్యయ పరిశీలకులకు సేతు మాధవన్ వివరించారు. నోడల్ అధికారి విద్యా సాగర్, తిరుపతయ్య ఉన్నారు.

విరాళం అందజేత

నెల్లూరు : ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తమ ఔదార్యం చాటుకున్నారు. నగరం లోని ప్రగతి ఛారిటీస్ సంస్థకు రూ.3 లక్షల విరాళం అందించి ఆదుకున్నారు. ఆదివారం ఛారిటీస్ ఇన్‌ఛార్జి సుబాష్ , పలువురు చిన్నారులతో కలిసి నగరం లోని వి.పి.ఆర్ నివాసంలో ఈ చెక్కును అందు కున్నారు. అనంతరం సుబాష్ మాట్లాడుతూ ఎం పి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏటా ప్రగతి ఛారిటీస్ నిర్వహణకు రూ.3 లక్షలు అందిస్తున్నారని తెలిపారు. ప్రగతి ఛారిటీస్ ద్వారా మూగ, చెముడు చిన్నారులకు చదువు అందిస్తున్నామన్నారు. పలువురు చిన్నారులు వేమిరెడ్డి దంపతులకు గులాబీ పూలు అందించి కతజ్ఞతలు తెలిపారు.

కర్లపాలెం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర పధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి -గుడ్లూరు : నిర్మాణ వ్యయం పెరిగిన నేపథ్యంలో రామాయ పట్నం పోర్టు పరిధిలోని నిర్వాసిత గ్రామమైన కర్ల పాలెం గ్రామస్తుల ఇళ్లకు మళ్లీ రీసర్వే చేసి తగిన పరిహారం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ సర్పంచ్ చాపల రమణయ్య అధ్యక్షతన కర్లపాలెంలో గ్రామ సభ జరిగింది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసిం హారావు మాట్లాడుతూ, పోర్టు కోసం మత్స్యకారులు, సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారన్నారు. వారిని ఆదు కోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రభుత్వ అధికారుల తీరుపై ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో, దేశంలో పోర్టులన్నీ ప్రయివేటు వ్యక్తులకు, అదానీ అంబానిలకు కట్టబెడుతున్నారన్నారు. వారి చేతుల్లోకి వెళ్లిన తరువాత, నిర్వాసితులను, పట్టించు కొనే వారే లేరని, ఆయన అన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే, పోరాటమే ఏకైక మార్గం అని ఆయన అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోగుల శీనయ్య మాట్లాడుతూ, కార్లపాలెం నిర్వాసితులకు, వేట కోసం, జెట్టి ఏర్పాటు చేయాలని, 18సంవత్స రాలు దాటిన వారందరికీ, 2024సంవత్సర %శీ% ప్రాతి పదికగా నిర్ణ యించి, ప్యాకేజీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 1లో ఉన్న 18.50సెంట్లు శివాయి భూమికి నష్ట పరిహారం చెల్లించాలని, కరువు భతి చెల్లించాలని, 14మంది ఆడ బిడ్డలకు మంజూరైన ప్యాకేజీ వెంటనే ఇవ్వాలన్నారు. చదువు కున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూతల పాటి వెంకటేశ్వర్లు, సురేంద్ర, చాపల మణి, శ్రీను, ఏడుకొండలు, చిన రమణయ్య , రాజేంద్ర, మీరయ్య,సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

పోర్టు కంటైనర్ కార్యకలాపాలు కొనసాగించాలి

నెల్లూరు : కష్ణపట్నం పోర్టు కంటైనర్‌ను యాజమాన్యం మరో ప్రాంతానికి తరలించడంతో తాము ఉద్యోగాలు కోల్పోయామని, రాష్ట్రంలో నూత నంగా ఏర్పడిన ప్రభుత్వం కంటైనర్‌ను పోర్టుకు తీసుకొచ్చి కార్యకలాపాలను వెంటనే ప్రారంభించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు డిమాం డ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఉపాధి కోల్పోయిన బి రామారావు అనే ఉద్యోగి మాట్లాడుతూ పోర్టు కంటైనర్ మరో ప్రాంతానికి తరలించడం వల్ల ఈ ప్రాంతం ఇప్పుడు కళా విహీనమైందన్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో పోర్ట్ కంటైనర్ టర్మినల్ ఆధారిత ఉద్యోగులు రాంబాబు, ఫరీద్, బాలచంద్ర, సంతోష్ ఉన్నారు.

భారత జట్టుకు శుభాకాంక్షలు : డివైఎఫ్ఐ

నెల్లూరు : టి 20 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ లో భారత జట్టు ప్రపంచ కప్ ను సాధించడం సంతోషంగా ఉందని డి వై ఎఫ్ ఐ నగర కమిటీ కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జ్యోతిరావు పూలే సెంటర్లో డివైఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కేకును అడ్వకేట్ అంకిరెడ్డి జనార్దన్ రెడ్డి కేక్ కట్ చేసి డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహకు తినిపించారు. డివైఎఫ్ ఐ నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ టీమిండియా కు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో అనేక ప్రాంతాలలో క్రీడా మైదానాలు లేక యువత అనేక చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని యువతని మంచి మార్గం వైపు నడిపించడానికి నగరంలో ఖాళీగా ఉన్న ప్రాంతాలలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ నగర ఉపా ధ్యక్షులు తిరుపతి జగదీష్ ,శేఖర్ ,కర్తం బాబు ,ఫయాజ్, సాయి గణేష్, సురేంద్ర, కుమార్ పాల్గొన్నారు.



కంటి వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -నెల్లూరు : కంటి వ్యాధులపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముందనిడాక్టర్ బీరం రాజేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ అండ్ లేజర్ సెంటర్ వారి సౌజన్యంతో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ సభ్యులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. పీ.హెచ్.పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. నారాయణ వైద్యశాల ఏజియం భాస్కర్ రెడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వేలైన్స్ ఆఫీసర్ డాక్టర్ సింగంశెట్టి భాస్కర్ మాట్లాడారు. పి.హెచ్.పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ న్యాయ సలహాదారు పి రమాదేవి ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు ఉన్నారు.

కంటైనర్ టెర్మినల్‌ను ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వెంకటాచలం : కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్‌ను తక్షణమే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం మోహన్‌రావు డిమాండ్ చేవారు. మండలంలోని తిక్కవరపాడులో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోహన్‌రావు పాల్గొని ప్రసం గించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం కలిసికట్టుగా కషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవే ర్చాలన్నారు. కష్ణ పట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ రవాణాను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయింపు పెంచాలని, రైతులు పండించిన పంటలకు సరి అయిన సరియైన మద్దతు ధర కల్పించాలని అన్నారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరారు. క్రిమినల్ చట్టాల సవరణ బిల్లులను వెంటనే ఆపివేయాలన్నారు. తరగ తులకు మండల కార్యదర్శి ఓడూరు వెంకటకష్ణ అధ్యక్షత వ్యవహరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, కమిటీ సభ్యులు చెంచు రామన్న, వెంకట శేషయ్య, శ్రీనివాసులు, సుధాకర్, వెంకయ్య,వేణు, చాన్ బాషా ఉన్నారు.

మాట్లాడుతున్న ఎం మోహన్‌రావు

నేటి నుంచి పింఛన్లు పంపిణీ : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను సిఎం నారా చంద్ర బాబు నయుడు నిలబెట్టుకున్నరని కందు కూరు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.. నియోజకవర్గంలో 40,735 మంది పింఛన్ దారులకు రూ27 కోట్ల, 23 లక్షల, 30 వేల, 500 రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అవయవ దానంపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు

మానవ శరీర అవయవాలను, కణజాలాన్ని మార్చగలడం వైద్యరంగం సాధించిన విప్లవాత్మకమైన చర్య అని పలువురు పేర్కొన్నారు. ఆదివారం నేత్ర,అవయవ, శరీర దాన అవగాహన సదస్సులో పాల్గొన్న అమ్మ నేత్ర, అవయవ,శరీరదాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంజి ఈశ్వర లింగం మాట్లాడారు. కందుకూరు స్కందపురి జనార్ధన స్వామి దేవాలయం కళ్యాణమండపంలో జరిగిన ఈ సదస్సులో పాల్గొన్న గంజి ఈశ్వర లింగం మాట్లాడారు. కార్యక్రమానికి ఉపాసికలు గాండ్ల హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన తన శరీరాన్ని దానం చేస్తూ అంగీకార పత్రమును అందించడం జరిగినది. ఆయనతోపాటు షేక్ నబీషా, షేక్ అహ్మద్, చనమాల బాలాజీ తదితరులు తమ నేత్ర, అవయవ, శరీర దానాలను చేయుటకు సంసిద్ధం వ్యక్తపరిచారు. . రావులకొల్లు బ్రహ్మానందం, డాక్టర్ తన్నీరు మల్లికార్జున, చనమాల కోటేశ్వరరావు, ముతకాని లక్ష్మీనారాయణ, పోకూరి కోటయ్య, షేక్ సలాం ఉన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఎంఎల్‌గా భారీ మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో ఇంటూరి నాగేశ్వరరావు విజయో త్సవ ప్రత్యేక సంచికను ప్రజాశక్తి తీసు కొచ్చింది. ఆదివారం ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వర రావు తన క్యాంప్ కార్యాలయంలో. ప్రజాశక్తి ప్రచురించిన 'కందుకూరు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక సంచిక'ను ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తోపాటు కందుకూరు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, లింగస ముద్రం ప్రజాశక్తి విలేకరి సిహెచ్ కొండలరావు ,కందుకూరి డివిజన్ ఇన్‌ఛార్జి మహేశ్వర రావు, కందుకూరు విలేకరి నాదెళ్ల కోటేశ్వరరావు, పి మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి..!

తోటపల్లిగూడూరు : జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పర్యాటకుల తో మండలం లోని కోడూరు సముద్ర తీరం ఆదివారం రద్దీగా మారింది. ఈ సందర్భంగా తీరం వెంబడి సందడి వాతావరణం ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు కోడూరు తీరానికి తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకుల రాకపోకలు సాగాయి. కుటుంబాల సమేతంగా వచ్చి తీరం వెంబడి సందడి చేశారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.



ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

కేంద్రమంత్రి దృష్టికి పొగాకు రైతు సమస్యలు

ప్రజాశక్తి-మర్రిపాడు

హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్లో కేంద్ర వాణిజ్య శాఖా మంత్రి పీయుష్ గోయల్ అధ్యక్షతన జరిగిన పొగాకు రైతుసంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో డిసిపల్లి పొగాకు బోర్డు రైతుసంఘం నాయకులు గాలినరసపునాయుడు పాల్గొని కేంద్ర మంత్రికి అభినందనలు తెలియజేసి రైతుల సమస్యలను వివరించారు. అధనపు పొగాకు ఉత్పత్తుల మీద 0 శాతం అపరాధ రుసుం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే బ్యారన్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌ను ప్రతి ఏడాది కాకుండా మూడేళ్లకు పెంచాలని, ఒక్కొ బ్యారన్‌కు పొగాకు పరిమాణమును 50 క్వింటాళ్లకు పెంచి, ఎన్ఓబిసి సబ్సిడీ అందించాలని, లూజు లీఫ్ బ్యారన్లకు రెండు లైసెన్సులకు బదులు ఒక్క లైసెన్సును తీసుకోవాలని, పొగాకు పంటకు క్రాప్ ఇన్సూరెన్సు ప్రవేశపెట్టి, బ్యారన్లకు సబ్సిడీతో సోలార్ కరెంటు, బల్క్ పెట్టెకు సబ్సిడీ పెంచి, రైతు సంక్షేమ నిధులు పెంచాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. ఎపి పురందేశ్వరి, వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్, భారత పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-కావలి : ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మొత్తాన్ని ఒకేసారి పెంచి, మూడు నెల బకాయిలు కూడా చెల్లించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో 37,504 మంది లబ్ధిదారులకు రూ.25,68,38,000 అందివ్వడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా పెద్ద మొత్తంలో లబ్ధిదారులు నగదును అందుకోబోతున్నార న్నారు. ప్రతి ఒక్కరిఇంట జులై ఒకటవ తేదీ పండుగ వాతావరణం కనబడబోతుందన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో తాను కూడా కలసివెళ్లి, నియోజకవర్గంలో జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించడం, పంపిణీలో పాల్గొనడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు పాల్గొన్నారు.

ఓబులేసు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-ఉదయగిరి : ఏ పాఠశాలలో పనిచేసినా స్థానికుల ప్రశంసలు పొందిన వెంకటరావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తెనపల్లి ఓబులేసు ఆదివారం ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నేటి వెంకటరెడ్డి కొనియాడారు. వెంకట్రావు పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉద్యోగ విరమణ సభ మండల విద్యా శాఖాధికారి తోట శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. వెంకట్రావుపల్లి పాఠశాల కోసం 5ఎకరాల ప్రభుత్వ భూమిలో పాఠశాల అభివృద్ధి పర్చడం ఓబులేసు కృషి వల్లే సాధ్యపడిందని తెలిపారు. ప్రభుత్వ, స్థానికుల, దాతల సహకారం పొందడంలో ఓబులేసు చేసిన అవిరళ కృషితోనే పాఠశాల అభివృద్ధి జరిగిందన్నారు. వందలాదిమంది అభిమానులు మిత్రులు, బంధువులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎల్‌సి రమణారెడ్డి, ఎపిటిఎఫ్ జిలా ప్రధాన కార్యదర్శి సిహెచ్ హజరత్, జిల్లానాయకులు పి.తిరుపతిరెడ్డి, శ్రీనివాసరాజు, ఖాజా, మాజీ మండల విద్యాధికారులు అల్లాభక్షు, ఓబులురెడ్డి, స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్.శ్రీరాములు, ఫడ్స్ డైరెక్టర్ రమణయ్య, స్థానిక పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు బలరాం పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్యం పనులు

ప్రజాశక్తి-ఉదయగిరి : డయేరియా ప్రబలకుండా పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు షేక్.కరీముల్లా దర్గిగుంట తేజ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ శకునాల పల్లి, పుల్లాయపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం, సోడియం హైపో క్లోరైడ్ కార్యాలయానికి చేరి స్టాక్ సిద్ధంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు నెలలపాటు నిర్వహించే స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నామని ఇక ముందు పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

సుధాకర్ సేవలు అమూల్యం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ డిపో సహాయక అధ్యక్షులు ఎన్.సుధాకర్ రెడ్డి పద్మావతమ్మ వారి పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం ఆవరణంలో ఆయన సన్మాన కార్యక్రమం మిత్రబృందం కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా ఉద్యోగ విరమణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో డిఎం శ్రీనివాసులు పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన డ్రైవర్ వృత్తిలో ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని జిల్లాస్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ప్రశాంతం పొందారని గుర్తు చేశారు. ఎన్నో వరిదుడుకులు కుటుంబ సమస్యలను ఎదుర్కొంటూ ఆయన ప్రజలు అందించిన సేవలు ఆయనకు ఆయన కుటుంబానికి ఇకనుండి అండగా నిలుస్తాయని దేవుని ఆశీస్సులు ఆయన శేషాజీవితానికి అండగా ఉండాలని కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్దాని, సెక్రటరీ రవి, వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాసులు, పార్టీ నాయకులు పరిధిని భాషా, నాగేశ్వరరావు, నాయబ్ తదితరులున్నారు.

ఎస్‌బిఐ ఉద్యోగుల రక్తదానం

ప్రజాశక్తి-కావలి : కావలి ఎస్‌బిఐ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించడంతో పాటు, సేవా కార్యక్రమాలలో ముందుంటారని స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ఎన్.శ్రీనివాస రావు పేర్కొన్నారు. దివంగత ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ నాయకులు తారకనాథ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్‌బిఐ ట్రంక్ రోడ్డు బ్రాంచ్‌లో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సిబ్బందితో పాటు వినియోగదారులు 104మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదాతలను అభినందించారు. ఈ శిబిరాన్ని ట్రంక్ రోడ్డు బ్రాంచ్ మేనేజర్ గొర్ల శివకుమార్ ప్రారంభించగా, స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ వివి ప్రసాద్, రీజియన్ కార్యదర్శి సనత్ కుమార్, మెయిన్ బ్రాంచ్ కార్యదర్శి కె.శ్రీనివాసులు రెడ్డి, ట్రంక్ రోడ్డు బ్రాంచ్ కార్యదర్శి కె.భువనేశ్వరి, టౌన్ బ్రాంచ్ కార్యదర్శి జ్యోస్న, టౌన్ బ్రాంచ్ మేనేజర్ నరేంద్ర, ఇతర బ్యాంక్ అధికారులు మహేష్, శేఖర్ బాబు, స్టాఫ్ యూనియన్ సభ్యులు సుమన, కళ్యాణి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై ఆడిట్

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ఉప్పలపాడు, ఆమెని చిరువెల్ల గ్రామాలలోని సచివాలయంలో ఆదివారం జాతీయ ఉపాధి హామీ ఆడిట్ గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా డిఆర్‌పిలు 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులు గురించి చదివి వినిపించారు. ఉపాధి హామీపై అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా అందజేయాలని డిఆర్‌పిలు పేర్కొన్నారు. పరిశీలకులు కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎపిఒ దయాసాగర్, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కోవూరు : జూన్ 1వ తేదీన ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు బిజెపి, జనసేన నాయకులు కూడా పాల్గొని విజయవంతం చేయాలని మండల టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డిపాలెం ఎంపిటిసి యద్దలపూడి నాగరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కోవూరు మండలంలో ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎంఎల్ఎ కాకర్ల సురేష్ సోమవారం చేపట్టే పెన్షన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న పిలుపునిచ్చారు.మండలంలోని ముఖ్య నాయకులు క్లస్టర్ ఇన్చార్జులు బూత్ ఇన్చార్జులు గ్రామ కమిటీ అధ్యక్షులు మాజీ ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రజాశక్తి-సంగం ఎంపిడిఒ కార్యాలయంలో ఆత్మకూరు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమణయ్య ఎంపిడిఒ శేషగిరిరావుతో సమావేశం నిర్వహించారు. మండలంలో 1వ తేదీ జరగబోయే పింఛన్ల పంపిణీ ఏర్పాట్లపై ఆయనతో చర్చించారు. పింఛన్ల పంపిణీ పగడ్బంధీగా చేపట్టాలని సూచించారు.

కుంకుమ పూజ

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో వెలసి ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఆదివారం ఉదయం నుండి వాల్మీకిపూజ, సహస్రనామార్చన, కుంకుమ పూజ, పొంగళ్ళు, మహా నివేదన వంటి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు చల్లా వంశస్థులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతోనూ, పుష్పాలతోనూ ప్రత్యేకంగా అలంకరించారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న మిరియం వెంకటేశ్వర్లు

సిఐటియు ఆధ్వర్యంలో కావలిలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు రెండోజు ఆదివారం నిర్వహించినట్లు సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఉదయం మిరియం వెంకటేశ్వర్లు వర్తమాన రాజకీయాలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మహనీయుడు కామ్రేడ్ అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య ఆనాడు దేశ ప్రయోజనాల కోసం ప్రజా సమస్యలపై కులమతాలకు అతీతంగా పని చేశారని తెలిపారు. అప్పుడు రాజకీయాలు నాయకులు అంటే ప్రజలకు అపారమైన గౌరవం ఉండేదని, ఇప్పుడు రాజకీయాలు చూస్తుంటే ఎన్నికలప్పుడు డబ్బు మద్యం విచ్చలవిడిగా పంచి రాజకీయాల్లో నెగ్గుతున్నారని విమర్శించారు. అప్పుడు ఇప్పుడు ప్రజలను ప్రలోభాలకు గురి చేయకుండా ఓట్లు అడుగుతున్నది కమ్యూనిస్టు పార్టీ లేనని తెలియజేశారు. ప్రజలు కమ్యూనిస్టు పార్టీలను గెలిపించలేక పోయినా, అప్పుడు ఇప్పుడు ప్రజల నుండి కమ్యూనిస్టులకు ఆదరణ ఉందని తెలిపారు. ప్రజా కార్మిక వ్యతిరేక పరిపాలన కొనసాగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీలను వెంటనే ప్రజలు అధికారానికి దూరంగా పెట్టారని, అంతేకాకుండా నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి కూడా ప్రజలు గట్టి షాక్ ఇచ్చారన్నారు. ఇప్పుడు ప్రజలకు వైద్యం విద్య ప్రయాణం కీలక సమస్యలుగా మారాయని, కేరళ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలను అమలు చేసిందని మిగిలిన రాష్ట్రాలు కనీస వేతనాలు కూడా అమలు చేయలేదని, విద్యను ప్రభుత్వం వ్యాపారంగా మార్చిందని ఎద్దేవా చేశారు. భారతదేశంలో ఉన్న మిగులు భూములను పంచితే పేదలకు ఇంటికి రెండు ఎకరాలు భూమి ఇవ్వొచ్చన్నారు. కార్మిక సంఘాలు ఎంత బలపడితే అంత కార్మికులకు మేలు జరుగుతుందని కార్మిక పోరాటాలు లేని ఈ శిక్షణ తరగతులు కార్యకర్తలకు ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం నుండి సిఐటియు నిర్మాణంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్ బోధించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఎస్‌కె.రెహానా బేగం, నాయకులు పి.పెంచలయ్య, వై.కృష్ణ మోహన్, ఎస్‌కె.గౌస్, జివివి కుమార్, నరహరి, టి.మాల్యాద్రితో పాటు జి.వెంకటేశ్వర్లు ఈ క్లాసులకు ప్రిన్సిపాల్‌గా వ్యవహించారు.

8కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-నెల్లూరు

మాట్లాడుతున్న ఎస్ఇబి ఇన్‌ఛార్జి సౌజన్య

నగరంలో ఎస్ఇబి పోలీసు బృందాలు నిర్వహించిన తనిఖీల్లో ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో 8.43 కేజీల గంజాయిని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ముగ్గురు నిందితులను, వారి వద్ద ఉన్న నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి ఇన్‌ఛార్జి సిహెచ్ సౌజన్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఎస్‌పి కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.బాలు శ్రీధర్ ఆధ్వర్యంలో డిఎస్ఇబి పోలీసు టీం సభ్యులు, నెల్లూరు-1 ఎస్ఇబి సిఐ, వారి బృందం సభ్యులు సంయుక్తంగా ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో నారాయణరెడ్డి పేట ప్రాంతానికి చెందిన రంజిత్ నాయక్ (39), ఒరిస్సా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన బుద్దా నాయక్ (36), రబీనాయక్ (55) అను వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సమయంలో వారి వద్ద గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులు గతంలో గంజాయి విక్రయిస్తూ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారని, పాత నేరస్తులు కావడంతో వారిపై నిఘా వేసి గతంలో వీరు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కందమహల్ జిల్లాలోని ఫుల్బాని పట్టణ సమీపంలో కేంజర్ గ్రామానికి చెందిన సూరజ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి కొత్తకాలువ సెంటర్ ప్రాంతంలో రైస్‌మిల్లులో పనిచేస్తూ గంజాయి వ్యసనపరులకు విక్రయించేందుకు తీసుకెళ్తున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఇబి, డిఎస్ఇబి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాల్యాద్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

మాల్యాద్రి సేవలు అపూర్వం

ప్రజాశక్తి-కావలి

గత 36యేళ్లుగా జవహర్ భారతి కళాశాలలో పని చేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేస్తున్న డాక్టర్ "రాయి మాల్యాద్రి విశ్వోదయ విద్యా సంస్థలకు చేసిన సేవలు అపూర్వమని విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాల్యాద్రి ఉద్యోగ విరమణ సందర్భంగా ఎం.ఎం.హాల్లో ఆయన సతీసమేతంగా వచ్చి ఘనంగా శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జవహర్ భారతిలో మాల్యాద్రి సహచరులు, స్నేహితులు, గురువులు, శిష్యులు దాదాపు 100 మందికిపైగా విచ్చేసి తమ నేస్తాన్ని శాలువాలు, కప్పి, పూలమాలలు వేసి, బొకేలు అందజేసి, ఘనంగా సత్కరించారు, విద్యాభ్యాసం నాటినుండి ఉద్యోగ విరమణ వరకు వారిమధ్యగల సంగతులన్నింటినీ చెప్పుకుని, ఉద్వేగంతో, ఆనందంతో ఆయనను సన్మానించారు.

నాగేశ్వరరావుకు పూల స్వాగతం

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉద్యోగ విరమణ పొందుతున్న మండల నాగేశ్వరరావుకు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తోటి బృందం వారి దంపతులకు పూల స్వాగతం పలికారు. ఆదివారం మండల పరిధిలోని అప్పసముద్రం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్ మండ్ల నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చెందుతున్న సందర్భంగా ఉపాధ్యాయ బందం మిత్రులు కుటుంబ సభ్యులు విద్యార్థులు మండ్ల నాగేశ్వరరావు, శ్రీదేవి దంపతులను సత్కరించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మిత్ర బృందం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రామస్తులు ఆయన పాఠశాల అభివృద్ధికి చేసిన ఆర్థిక సహాయం వారి అందించిన ఉచిత సేవలు గుర్తు చేశారు. విద్యాబోధనను ఆయనను దూరమవుతున్నందుకు దు:ఖిస్తూ ఆయనకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తర్లపాటి విజయకుమార్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, మాలకొండయ్య, కృష్ణయ్య, మిత్ర బృందం సుబ్బారెడ్డి, ఫణిరాజ్, కుటుంబ సభ్యులు, విద్యార్థులు, విద్యా కమిటీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

లబ్ధిదారుల గడప వద్దనే పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరు మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గం చెందిన మాజీ ఎంఎల్ఎలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, ప్రచార కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచలబాబు యాదవ్ లతో కలిసి స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఎనిమిది మండలాల ఎంపిడిఒలు, నియోజకవర్గంలోని కూటమి నాయకులందరితో టెలిఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు హామీలపై మొదటి సంతకం చేశారని వాటిలో ఒకటి పింఛన్ పెంపుదల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.7వేలు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. కనుక సచివాలయ సిబ్బందితో కలిసి పట్టణాలు గ్రామాలలో స్థానిక కూటమి నాయకులు పింఛన్‌దారుల గడప వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని తెలిపారు. ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టి సాయంత్రం లోపు 100శాతం పూర్తి చేయాలని తెలిపారు. పింఛన్లు పంపిణీ పారదర్శకంగా జరగాలన్నారు. నాయకులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన పార్టీ కార్యాలయానికి తెలియబరచాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉదయం 6 గంటలకే మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాక గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతినాయకుడి నుండి కార్యకర్త వరకు పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని తెలిపారు. అదేవిధంగా లబ్ధిదారులకు పెంచిన పింఛన్లపై వివరించాలన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, మండల నాయకులు, కూటమి నాయకులు ఒక పండుగ వాతావరణంలో గడపగడపకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని ఎంఎల్ఎ టెలిఫోన్ కాన్ఫరెన్స్‌లో తెలిపారు.

ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-వరికుంటపాడు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎంఎల్ఎ కాకర్ల సురేష్, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి పాల్గొన్నారు. ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఉపాధ్యాయుడిని సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు, నాయకులు, ఎంఎల్ఎను, మాజీ ఎంఎల్ఎను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది అని, చిన్నస్థాయి నుంచి ఉన్నత శికరాలకు ఎదగాలి అన్న ఉపాధ్యాయులు ఎంతో ప్రాముఖ్యం అన్నారు కాబట్టి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలలో ఐదు పథకాలపై సంతకాలు చేశారరు. వాటిని తూ.చా. తప్పకుండా అందించిన ఘనత చంద్రబాబు నాయుడుకే సాధ్యమైందన్నారు. ఇంకా కూడా ఇచ్చిన హామీలను పరిశీలించి అన్ని పథకాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, టిడిపి సీనియర్ నేతలు సుంకర అంజనాద్రి, వెంకటాద్రి, తెలుగు యువత లక్ష్మీ నారాయణ, బిసి సెల్ అధ్యక్షులు కొండలరావు యాదవ్, ఎస్‌సిసెల్ అధ్యక్షులు లాభాన్,టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి, మాలకొండారెడ్డి, మాధవ, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లా పిఆర్‌టియు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులు డి.వెంకట రాజుకు ఆదివారం ఉద్యోగ విరమణ సన్మానం కార్యక్రమాన్ని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. దాదాపు 38 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొన్ని వేలమందికి విద్యాభోదన చేసి నేడు ఉద్యోగవిరమణ చేసిన "దాసరి రాజు వెంకటరాజును జిల్లా పిఆర్‌టియు శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని కిలారి తిరుపతినాయుడు కళ్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మిట్టా.కృష్ణయ్య, గిరిప్రసాద్, కారణానిది మూర్తి, శ్రీనివాస రాజు, నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ రాజకీయ నాయకులు చెవూరు విజయమోహనరెడ్డి, పాల్గొని రాజుగారికి వీడ్కోలు శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి 'ఆనం' పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిల, అనంతసాగరం, గౌరవరం గ్రామాలలో ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రానున్నట్లు మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత సుబ్బరాజు ఆదివారం తెలిపారు. మండలంలోని సోమశిలకు సాయంత్రం నాలుగు గంటలకు, అనంతసాగరంకు 5 గంటలకు, గౌరవరం గ్రామానికి 5.30గంటలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ లబ్ధిదారులకు మంత్రి ఆనం చేతుల మీదుగా పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. తెలుగుదేశం నాయకులు, జనసేన నాయకులు, బిజెపి నాయకులు, తెలుగుదేశం నాయకులు, పాల్గొనాలని ఆమె కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కావలి

కావలి రూరల్ మండలం తాళ్లపాలెం పంచాయతీ జువ్విగుంటపాలెంలో శనివారం రాత్రి మూడు గడ్డి వాములు అగ్నికి ఆహుతి కావడం జరిగింది. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆదివారం వారి గ్రామానికి వెళ్లి, అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. భాధిత కుటుంబ సభ్యులను అడిగి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పశువుల మేత అగ్నికి ఆహుతి కావడం బాధాకరమన్నారు. గడ్డి వాముల యజమానులు నారి సుందర రావు, నారి రమేష్, కోటేశ్వరరావులకు సాయమందించారు.

నేడు పలుచోట్ల మంత్రి 'ఆనం' పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని మంత్రి క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు సంగం మండలంలోని సిద్దిపురం, మండల కేంద్రంలోని సంగం వీవర్స్ కాలనీలో.. ఉదయం 8 గంటలకు ఎఎస్‌పేట మండలంలోని హసనాపురం, చిరమన, మండల కేంద్రం ఎఎస్.పేట గ్రామంలో ఉదయం 10 గంటలకు ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటలకు ఆత్మకూరు రూరల్ మండలం బట్టేపాడు గ్రామంలో మధ్యాహ్నం 1 గంటకు చేజర్ల మండలం పెరుమాళ్ళపాడు గార్డెన్స్‌లో లంచ్ విరామం మధ్యాహ్నం 2.30 గంటలకు చేజర్ల మండలం చేజర్ల ఎస్‌సి కాలనీ, బోడిపాడు ఎస్‌టి కాలనీ సాయంత్రం 4 గంటలకు అనంతసాగరం మండలం సోమశిల అనంతసాగరం, గౌరవరం గ్రామాల్లో.. సాయంత్రం 5 గంటలకు మర్రిపాడు మండలం తిక్కవరం, మర్రిపాడు డి.సి.పల్లి గ్రామాల్లో రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం సోమశిలకు రానున్నట్లు టిడిపి మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి యోగు పెంచలయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా యోగు పెంచలయ్య మాట్లాడుతూ సోమశిల గ్రామంలోని సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా హిల్ కాలనీ, బస్టాండ్ సెంటర్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. గ్రామంలోని జనసేన, బిజెపి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.



ప్రజాశక్తి-మర్రిపాడు : ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం మర్రిపాడు, తిక్కవరం, డిసిపల్లి గ్రామాల్లో సాయంత్రం 5 గంటలకు పర్యటించనున్నట్లు టిడిపి మండలాధ్యక్షులు అరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ మండలాధ్యక్షులు శాఖమూరి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో జరిగే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. గ్రామంలోని జనసేన, బిజెపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ భూములను కాపాడుకుందాం..

ప్రజాశక్తి-కావలి :

ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూములను కాపాడుకుందా మని కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి (కావ్య క్రిష్ణారెడ్డి) పిలుపునిచ్చారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆక్రమిత భూములు ఎవరి ఆధీనంలో ఉన్నా, స్వాధీనానికి ముందుండి సహకరిస్తానన్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి మాటలను స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. మన, తన తారతమ్య బేధాలొద్దని, ఎవరైనా ఒకటేనని, లేఅవుట్‌లు ఎవరివైనా ఒకటేనని, కాలువలు, కుంటలు, ప్రభుత్వ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నా సరే ప్రభుత్వానికి స్వాధీనం చేద్దామన్నారు. నుడా, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ తదితర అధికార యంత్రాంగాన్ని వెంటపెట్టుకుని వెళదాం.. అక్రమార్కుల పని పడదామన్నారు. కావలి సుందర పట్టణంగా, పర్యాటక ప్రాంతంగా, పారిశ్రామిక కేంద్రంగా, యువత ఉపాధికి స్వర్గధామంగా, రెండు పంటల సాగు యోగ్యంగా, శాంతి, సుస్థిరత, సౌభాగ్యాలకు నిలయంగా అభివృద్ధి చెందాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. మాఫియాల ముసుగులు తొలగించి అభివృద్ధికి పాటుపడతానంటే అంతకంటే ఏం కావాలంటూ, అక్రమాల భరతం పడుదామంటూ చరిత్రాత్మక నిర్ణయంతో ముందుకొచ్చిన ప్రతాప్ కుమార్ రెడ్డికి అభినందనలంటూ ఎంఎల్ఎ అన్నారు.

నజీర్ భాషా ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతి ఉద్యోగి జీవితంలో విరమణ సహజమని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని రవితేజ కళ్యాణమండపంలో ఎంఇఒ షేక్ నజీర్‌బాషా ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం మాట్లాడుతూ 29 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో పాఠశాల సహాయకులుగా మొదట ఉద్యోగ జీవితం ప్రారంభించి ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారిగా సమాజ దేవాలయంలో పాఠశాల ఉద్యానవనంలో ఎన్నో విద్య కుసుమాలను వారి ఉన్నత శిఖరాలను మాటలు వేసిన ఉపాధ్యాయుల మార్గదర్శి మండల విద్యా రథసారథి అని ఆయన అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న ఎంఇఒ నజీర్ భాషాను ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి, ఆత్మకూరు డిప్యూటీ డిఇఒ గోపాల్, ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి, ఎంఇఒ చలపతిరావు ఎపి ప్రధానోపాధ్యాయుల జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ బాలాజీ నాయక్, జెడ్‌పిటిసి ప్రసన్నలక్ష్మి, తరుణవాయి ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరమ్మ, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

923 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో అపరిష్కృతంగా కోర్టు లలో ఉన్న 923 కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం లభించిందని ఎస్‌పి కె.ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు పత్రికలుకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉభయ పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను చేయుట కొరకు శనివారం నిర్వహించిన నేషనల్ లోక్‌అదాలత్‌లో కేసులకు పరిష్కారం లభించడం సంతోషకరమన్నారు. 923 కేసులకు పరిష్కారం దొరకడం జిల్లా చరిత్రలో మెరుగైన రికార్డు నమోదు అన్నారు.

వైసిపి హయాంలో జగనన్న కాలనీల్లో అక్రమాలు

ప్రజాశక్తి-కోవూరు : వైసిపి ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయని టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి టిడిపి హయాంలో 2014-19 సంవత్సరాల మధ్య ఎన్‌టిఆర్ గృహ నిర్మాణం కింద పెద్దఎత్తున పేదలకు గృహాలు మంజూరు చేశారు. ఈ పథకం కింద గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు 2019 ఫిబ్రవరి వరకూ నాటి ప్రభుత్వం బిల్లులు చెల్లించిందన్నారు. ఎన్నికలు కోడ్ రావడం కారణంగా మిగిలిన బిల్లులు చెల్లించలేకపోయిందని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం 2019లో అధికారం కోల్పోయే నాటికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కలిపి దాదాపు రూ.1350 కోట్లు హౌసింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, టిడిపి హయాంలో గృహాలు మంజూరైన వారంతా టిడిపి వారనే ఉద్దేశంతో, గత ఐదు సంవత్సరాలుగా వారికి ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించలేదని తెలిపారు. బిల్లులు రావాల్సిన వారందరూ పేద వారని, వారికి రావాల్సిన బకాయిలు రాక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారికి చెల్లించాల్సి బకాయిలు చెల్లించి, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. గృహ నిర్మాణ శాఖలో వైసిపి ప్రభుత్వం హయాంలో పెద్దఎత్తున అవనితి, అక్రమాలు జరిగాయని, ప్రభుత్వం జగనన్న కాలనీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

ఐఎంఎ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి

వైద్యులు ప్రత్యక్ష దైవాలు, వారికి ఏ అవసరం వచ్చినా అన్నివేళలా అండగా తోడుంటా.. అని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. "డాక్టర్స్ డే" సందర్భంగా రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐఎంఎ వైద్యులు, రెడ్‌క్రాస్ నిర్వాహకులను అభినందించారు. 1200 మందికి పైగా రక్తదానం చేయడంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదాల కారణంగానో, మరేదైనా కారణమే పోతున్న ప్రాణాలను తమ సేవల ద్వారా కాపాడి తిరిగి సాధారణ స్థితికి చేర్చి కొత్త జీవితాన్ని ఇచ్చేవారు వైద్యులు, వారు నిబద్ధతతో చేసే సేవలు వర్ణించతరం కానివి అని ఆయన వివరించారు. ముందుగా ఆర్‌డిఒ శీనానాయక్, వైద్యులతో కలసి రెడ్‌క్రాస్ ఆవరణంలోని కలిసి గాంధీ విగ్రహానికి, రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకులు హెన్ డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పిదప రక్తదాతలను, వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతూ కావలి పట్టణ పేద బడుగు వర్గాల ప్రజల సంక్షేమం కొరకు మీతో కలసి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన సోమశిల ప్రాజెక్ట్ మాజీ అధ్యక్షులు కండ్లగుంట మధుబాబు నాయుడుకు ఉత్తమ రక్తదాత అవార్డును ప్రదానం చేశారు. శాసనసభ్యులు దగుమాటి క్రిష్ణారెడ్డిని రెడ్‌క్రాస్, ఐఎంఎ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బి.రవికుమార్ అధ్యక్షత వహించగా, ఆర్‌డిఒ వికె శీనానాయక్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కావలి శాఖ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ వి.గోపి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవి ప్రకాష్, కె.హరినారపరెడ్డి, ఐ.ఎం.ఎ. బాధ్యులు డాక్టర్ నళినిపద్మ, డాక్టర్ పద్మజ, డాక్టర్ అల్లం శ్రీనివాసులు, డాక్టర్ రామస్వామి, డాక్టర్ సతీష్,డాక్టర్ శ్రీరామ్ డాక్టర్ మనోహర్ బాబు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ రేవంత్, టీం సేవియర్స్ ప్రణీత్ బృందం, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభించిన కావలి ఎం.ఎల్.ఎ క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి
సోమవారం 1 జులై 2024 8 పేజీలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

'ఇంటూరి' మనవాడే..!

ఇదే గెలుపు మంత్రం.. ఎమ్మెల్యేగా ఇంటూరి ఎన్నిక

అసెంబ్లీలో ఎంఎల్ఎగా ప్రమాణస్వీకారం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-లింగసముద్రం

గడచిన రెండున్నరేళ్లుగా కందుకూరు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఎంతోమంది నిరుపేదల ఉపాధి కోసం తోపుడు బండ్లు అందజేయడం, అనారోగ్యంతో ఆస్పత్రుల్లోని పలు కుటుంబాలకు మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సహాయం లాంటి అనేక సేవా కార్యక్రమాలను ఇంటూరి నాగేశ్వరరావు విస్తతంగా చేపట్టారు. ఈ కాలంలోనే కందుకూరు నియోజకవర్గ ప్రజలందరితో మమేకమైన ఇంటూరి వారి సమస్యలను ఆసాంతం ఆలకించి పరిష్కార మార్గాలపై వారికి తగిన భరోసా ఇచ్చారు. తరువాత కాలం లో ఇంటూరి సేవా కార్యక్రమాలు, ప్రజలతో మమేకమై నెరిపిన సత్సంబంధాలను

▶ 2లో

ప్రజలకు 'ఇంటూరి' అభివాదం..

'ఇంటూరి' బయోడేటా..!

పేరు : ఇంటూరి నాగేశ్వరరావు
పుట్టిన తేది : 04-07- 1976
విద్యార్హతలు : ఇంటర్మీడియట్
తల్లిదండ్రులు : లక్ష్మమ్మ, సుబ్బారావు
భార్య: ఇంటూరి సౌజన్య
సంతానం : ఇద్దరు కుమారులు(అవినాష్, సందీప్)
స్వగ్రామం : బడేవారిపాలెం గ్రామం, వలేటివారిపాలెం మండలం, కందుకూరు నియోజకవర్గం.
వృత్తి : రియల్ ఎస్టేట్
రాజకీయ నేపథ్యం : ఇంటూరి నాగేశ్వరావు తెలుగు దేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేశారు. 2013-18 కాలంలో ఇంటూరి సతీమణి ఇంటూరి సౌజన్య తొలిసారిగా బడేవారిపాలెం సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు.

మండలాల వారీగా 'ఇంటూరి'కి మెజారిటీ..

ప్రజాశక్తి -లింగసముద్రం :కందుకూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా విజయం సాధించిన ఇంటూరి నాగేశ్వరరావుకు మండలాల వారీగా మెజారిటీ వచ్చింది. ఆ వివరాలు...

కందుకూరు టౌన్: 7383,
కందుకూరు రూరల్: 2142,
లింగసముద్రం: 2890,
వలేటివారిపాలెం: 2856,
ఉలవపాడు: 2106, గుడ్లూరు: 530,
పోస్టల్ బ్యాలెట్లు: 651,మొత్తంగా టిడిపి మెజారిటీ: 18,558.

'ఇంటూరి' మనవాడే..!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించిన తెలుగుదేశం పార్టీ అధిష్టానం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా ఇంటూరిని నియ మించడంతో తన సేవా కార్యక్రమాలను అయన మరింత చొరవగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలతో ఇంటూరికి ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో టిడిపి అధిష్టానం నిర్వహించిన పలు సర్వేలలోనూ ప్రథమ స్థానం సంపాదించిన ఇంటూరి కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అర్హత సాధించారు. అయితే మరి కొద్ది రోజులలో ఇంటూరిని అభ్యర్థిగా ప్రకటిస్తారన్న సమాచారంతో కందుకూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా ఇంటూరి పనికిరాడంటూ అనేక అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనప్పటికీ టిడిపి అధిష్టానం ఇంటూరి వైపే మొగ్గు చూపింది. అభ్యర్థిత్వం ఖరారైన కొద్దిరోజుల పాటు పలువురు టిడిపి అగ్ర నాయకులు సైతం ఇంటూరి కి తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటిం చడంతో నియోజకవర్గ టీడీపీ శ్రేణులలో

లింగసముద్రంలో ప్రజలతో మమేకమైన ఇంటూరి

కొంత ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో టిడిపి అధిష్టానం ఆదేశాలతో రంగంలోకి దిగిన నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొంత చాకచక్యంగా వ్యవహరించి ఇంటూరి పై తిరుగుబాటు బావుటా ఎగరేసిన టిడిపి నేతలనందరినీ ఒకే తాటి పైకి తెచ్చి పరిస్థితిని చక్కబెట్టారు.

అనంతరం నిర్వహించిన విస్తృత ప్రచారంలో ఇంటూరి సతీమణి సౌజన్య తన మార్కు ప్రచారంతో ప్రజలను, ప్రత్యేకించి మహిళలను విశేషంగా ఆకట్టుకున్నారు. సౌజన్యతో పాటు కుమారులు కూడా నిర్వహించిన ఈ ప్రచార సరళిలో ఇంటూరిని మనవాడు గా భావించిన కందుకూరు ప్రజలు గతంలో ఏ నాయకుడికీ దక్కని అత్యధిక మెజారిటీతో ఆయనను ఎమ్మెల్యే సీటులో కూర్చోబెట్టారు.

ఇంటూరి నివాసం వద్ద నేతల క్యూ..!

అయితే అసలైన సవాళ్లన్నీ ఇప్పుడే ఇంటూరి ముందు ఉన్నాయి. ఇంటూరి గెలిచిన మరుసటి రోజు నుండి టిడిపి నాయకులు పదవుల పందేరం కోసం ఇంటూరి నివాసం, క్యాంపు కార్యాలయం వద్దకు క్యూలు కడుతున్నారు. పార్టీ గెలుపు కోసం మేము పనిచేశామంటే కాదు మేమే చేశామంటూ రేషన్ షాపులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పదవులను తమ వారికే ఇవ్వాలంటూ ఇంటూరి పై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. మరో పక్క కందుకూరుతో పాటు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కందుకూరు పట్టణం, మండలాలపై తమకే పెత్తనం కావాలంటూ కూడా ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో కరవమంటే కప్పకు కోపం.. వదలమంటే పాముకు కోపం అన్న చందంగా ఇంటూరి పరిస్థితి మారింది. ఈ నేపథ్యంలో తనను భారీ మెజారిటీతో గెలిపించిన కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆశలకు అనుగుణంగా భవిష్యత్తులో ఆయన విధి, విధానాలు, వ్యవహార శైలి ఉంటాయా.. లేదా అన్నది రానున్న కాలంలో వేచి చూడాలి.

పాత, కొత్త చెరువులకు 'రాళ్లపాడు' నీటిని తరలించాలి..!

నీలం బ్రహ్మారెడ్డి- టిడిపి నాయకులు

కొత్త చెరువు

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రంలోని పాత చెరువు, కొత్తచెరువులను అభివృద్ధి చేసి రాళ్లపాడు ప్రాజెక్టు నీటిని తరలింపునకు ప్రత్యేక దష్టి పెట్టి ప్రణాళికలను సిద్ధం చేయాలని టిడిపి నీలం బ్రహ్మారెడ్డి కోరారు. రెండు చెరువుల కింద వందల ఎకరాలు మగానీ భూములు బీడు భూములుగా మారి చిల్లర చెట్లతో పెరిగి అడవులను తలపిస్తున్నాయని అన్నారు. సుమారు 15 సంవత్సరాల నుండి ఈ రెండు చెరువుల్లోకి పంటల సాగుకు అవసరమైన నీరు రాకపోవడంతో రైతులు వ్యవ సాయానికి దూరమయ్యారు. ముఖ్యంగా రెండు చెరువుల కింద వరి సాగు చేసి జీవనం సాగించే రైతులకు చెరువులు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో వ్యవసాయాన్ని వదిలి ఊరు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగించు కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చెప్పారు. చెరువులకు నీరు చేరకపోవడంతో వందలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. అదేవిధంగా చెరువుల్లో కూడా విపరీతంగా చిల్ల చెట్లు పెరిగిపోయాయి. ఈ రెండు చెరువులకు పూర్వవైభం రావాలంటే రాళ్లపాడు ప్రాజెక్టు నుండి నీటిని తరలించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసి ఆ దిశగా ప్రయత్నం చేస్తే సఫలీకతమయ్యే అవకాశం ఉందన్నారు. ఎప్పటినుండో రైతులు రాళ్లపాడు ప్రాజెక్టు నీటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ఆ దిశగా అధికారులు గాని పాలకులు గాని దష్టి సారించలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. చెరువుల కింద ఉన్న మాగాన్ని భూములను తిరిగి సాగులోకి తీసుక రావాలంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే బాగుంటుందని చెప్పారు. లింగసముద్రం పాత చెరువు కింద లింగసముద్రం, తిమ్మారెడ్డి పాలెం, గంగపాలెం పంచాయతీల రైతులు మాగాని భూముల్లో వారిపై

పాతచెరువు

సాగు చేసుకునేవారు. అదేవిధంగా కొత్తచెరువు కింద లింగస ముద్రం రైతులు వరి సాగును ఇతర పంటలను సాగు చేసుకునేవారు. చెరువుల్లోనికి నీరు చేరకపో వడంతో రైతులందరూ వ్యవసాయానికి స్వస్తి చెప్పారు. వ్యవసాయ భూములు ఉన్న రైతులు కూలీలుగా మారి ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు ఈ అంశంపై దష్టి పెట్టి రాళ్లపాడు ప్రాజెక్టు నీటిని రెండు చెరువులకు తర లించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆశగా ఎదురు చూస్తున్న రైతుల కలలను నెరవేర్చాలని ఆయన కోరుతున్నారు.

పార్టీ నిర్మాణానికి కృషి

అంగులూరి నరసింహారావు - జనసేన మండల అధ్యక్షులు

ప్రజాశక్తి - లింగసముద్రం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమిపార్టీలకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కల్పించి, జనసేన పార్టీకి రాష్ట్రంలో అఖండ విజయాన్ని అందించడం గర్వించదగ్గ విషయమని జనసేన పార్టీ మండల అధ్యక్షులు అంగులూరి నరసింహారావు అన్నారు. లింగసముద్రం మండలంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీలు సమన్వయంతో పనిచేసే కందుకూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలుపు కోసం కషి చేయడం జరిగిందని అన్నారు. మండలంలో భారీ మెజార్టీని తీసుకురావడంలో అందరూ కలిసికట్టుగా పనిచేయడం జరిగిందని,గతంలో ఎవరికి రానీ మెజార్టీని ఈ మండలం నుండి రావడం పట్ల కార్యకర్తల కషి ఎంతో ఉందన్నారు. జనసేన పార్టీ ఎన్నికల్లో ప్రత్యేక దష్టి పెట్టి యువతలో చైతన్యం తీసుకువచ్చి ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లందరూ స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు వేసేలా వారిలో అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు.ముఖ్యంగా కాపుల్లో వచ్చిన చైతన్యం వల్లనే జనసేన ఈ రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి దేశంలో ఎవరికి సాధ్యపడని రికార్డును జనసేన పార్టీ సష్టించిందని అన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో జనసేన నాయకులకు కార్యకర్తలకు అన్ని విధాల ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమ పథకాలను అందించడంలో గాని వారి అభివద్ధిలో దోహదపడడంలో గాని ముందుండి నడిపి స్తానని అన్నారు.మండలంలో అన్ని గ్రామాలలో జనసేన పార్టీ అభివద్ధి చేసే దిశగా ఇప్పటినుండి అడుగులు వేయడం జరుగుతుందని పార్టీ నిర్మాణానికి కలిసి వచ్చే ప్రతి ఒక్కరితో ముందుకు నడుస్తామన్నారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ కూడా మండలంలో ఒక బలమైన రాజకీయ పార్టీగా అవతరించే విధంగా పనిచేయడం జరుగుతుందని అందుకు ప్రణాళికలను కూడా సిద్ధం చేసుకుంటున్నామన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అభిమానులు ఉన్నప్పటికీ పార్టీ నిర్మాణానికి వారిని భాగస్వాములను చేసేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

అంగులూరి నరసింహారావు

'ఇంటూరి' విజయంతో కార్యకర్తల్లో జోష్..

20 ఏళ్ల నిరీక్షణకు తెర - తోపూరి రమేష్ , తెలుగు యువత నాయకులు

ప్రజాశక్తి - లింగసముద్రం

కందుకూరు శాసనసభ్యులుగా టిడిపి అభ్యర్థి ఇంటూరరి నాగేశ్వరావు గెలుపు కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేశారని తెలుగు యువత నాయకులు తోపూరి రమేష్ అన్నారు. నియోజకవర్గంలో 20 సంవత్సరాలు నుండి పార్టీ అభ్యర్థి ఓడిపోతూ వస్తున్నప్పటికీ ఈసారి ఎలాగైనా కందుకూరు నియోజకవర్గం లో తెలుగుదేశం జెండాను ఎగిరే విధంగా పనిచేసి శాసనసభ్యులుగా టిడిపి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుని గెలిపిం చుకోవాలని కషి చేశారన్నారు.భారీ మెజార్టీతో గెలిపించి గతంలో ఎవరు సాధించిన విజయాన్ని తెలుగుదేశం పార్టీకి నాగేశ్వరరావు అందించారని ఆ విజయంతో టీడీపీ శ్రేణులు ఉప్పొంగిపోయి గెలుపుని ఆస్వాదిస్తున్నాయన్నారు. నియోజ కవర్గంలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ నాయకత్వం లేకపోవడం వల్లనే వరుస ఓటమి మనకు కారణమనే విశ్లేషణలు చాలా ఉన్నాయి. నియోజకవర్గంలోనే లింగసముద్రం మండలంలో ప్రతిష్టమైన నాయకత్వం సమిష్టిగా పనిచేసి బలమైన క్యాడర్ ను ముందుండి నడిపించి మండలంలో తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ రావడానికి కషి జరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా మండలంలో ఉన్న క్యాడర్ను నాయకత్వం కాపాడుకుంటూ రావాలని, నాగేశ్వరరావు చుకోవాలన్నారు.



ఇంటూరిని సన్మానిస్తున్న రమేష్

వారికి ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా నాయకత్వం చేయాలన్నారు. పార్టీ అభివద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామాల్లో ఉన్న నాయకులు సమన్వ యంతో ఉండాల న్నారు.తీసుకొస్తున్న పథకాలను ప్రజలకు అందేలా అందరూ పని చేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా నాయకులు కషి చేయాలన్నారు. లింగసముద్రం మండలంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే విధంగా అధికారులతో చర్చించి శాసనసభ్యులు ఇంటూరి సహకారంతో పరిష్కరిం

లింగసముద్రంలో బూత్‌ల వారిగా టిడిపి మెజార్టీ

ప్రజాశక్తి - లింగసముద్రం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి లింగసముద్రం మండలంలో 2890 ఓట్లు మెజార్టీ రావడం జరిగింది.తెలుగుదేశం పార్టీకి 15019 ఓట్లు రాగా వైసీపీకి 12,129 ఓట్లు వచ్చాయి. మండలంలో 16 పంచాయతీల్లో 38 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహించడం జరిగింది.పోలింగ్ కేంద్రాల వారిగా మొత్తం ఓట్లు పోలైన ఓట్లు టిడిపికి వైసీపీకి వచ్చిన ఓట్లు మెజార్టీ వివరాలు పోలింగ్ కేంద్రాల వారిగా ఇలా ఉన్నాయి.

యర్రారెడ్డిపాలెంలోని 47వ పోలింగ్ కేంద్రంలో 1077 ఓట్లు ఉండగా 1009 ఓట్లు పోలయ్యాయి. 516 టిడిపికి 470,వైసీపీకి వచ్చాయి.47 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది. వెంగళపురంలోని 48వ పోలింగ్ కేంద్రంలో 705 ఓట్లు ఉండగా 656 ఓట్లు పోలయ్యాయి.291 ఓట్లు టిడిపికి,345 ఓట్లు వైసిపికి రావడం జరిగింది.54 ఓట్లు వైసిపికి మెజార్టీ వచ్చింది.

తిమ్మారెడ్డిపాలెంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 49లో 1085 ఓట్లు ఉండగా 961 ఓట్లు పోలయ్యాయి. 276 ఓట్లు టిడిపికి 656 ఓట్లు,వైసిపికి వచ్చాయి.380 ఓట్లు వైసీపీకి మెజార్టీ దక్కింది. 50వ పోలింగ్ కేంద్రంలో 752 ఓట్లు ఉండగా 702 ఓట్లు పోలయ్యాయి. టిడిపికి 277 ఓట్లు, వైసిపికి 412 ఓట్లు వచ్చాయి.135 ఓట్లు వైసిపికి మెజార్టీ రావడం జరిగింది.

గంగపాలెం గ్రామంలోని 51వ పోలింగ్ కేంద్రంలో 840 ఓట్లు ఉండగా 795 ఓట్లు పోలయ్యాయి. 402 ఓట్లు టిడిపికి,371 ఓట్లు వైసిపికి వచ్చాయి,31 ఓట్లు టిడిపికి మెజార్టీ దక్కింది.

మాలకొండరాయునిపాలెంలో ఏర్పాటు చేసిన 52వ పోలింగ్ కేంద్రంలో 861 ఓట్లు ఉండగా 801 ఓట్లు పోలయ్యాయి. 318 ఓట్లు టిడిపికి,459 ఓట్లు వైసిపికి వచ్చాయి.141 ఓట్లు వైసిపికి ఈ గ్రామంలో మెజార్టీ రావడం జరిగింది.

విశ్వనాధపురం గ్రామంలో 53వ పోలింగ్ కేంద్రం లో 774 ఓట్లు ఉండగా 739 ఓట్లు పోలయ్యాయి.వీటిలో 402 ఓట్లు టిడిపికి,336 ఓట్లు వైసిపి కి వచ్చాయి.66 ఓట్లు టిడిపికి మెజార్టీ రావడం జరిగింది.

విఆర్ కోట గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఉండగా 54వ పోలింగ్ కేంద్రంలో 930 ఓట్లు ఉండగా 845 ఓట్లు పోలయ్యాయి 558 ఓట్లు టిడిపికి రాగా,235 ఓట్లు వైసిపికి వచ్చాయి.353 ఓట్లు టిడిపికి మెజార్టీ రావడం జరిగింది. 55వ పోలింగ్ కేంద్రంలో 827 ఓట్లు ఉండగా 749 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 534 ఓట్లు టిడిపికి,193 ఓట్లు వైసిపికి వచ్చాయి.341 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.56వ పోలింగ్ కేంద్రంలో 463 ఓట్లు ఉండగా 437 ఓట్లు పోలయ్యాయి.245 ఓట్లు టిడిపికి,177 ఓట్లు వైసిపికి వచ్చాయి.68 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.తనూగుంట గ్రామంలో 57వ పోలింగ్ కేంద్రంలో 538 ఓట్లు ఉండగా 495 ఓట్లు పోలయ్యాయి వీటిలో 314 ఓట్లు టిడిపికి 171 ఓట్లు,వైసిపికి వచ్చాయి.143 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

ఓటేసేందుకు బారులు తీరన ఓటర్లు (ఫైల్)

చీమలపెంట గ్రామంలో ఉన్న 58వ పోలింగ్ కేంద్రంలో 697 ఓట్లు ఉండగా 683 ఓట్లు పోలయ్యాయి.357 ఓట్లు టిడిపికి 319 ఓట్లు,వైసిపికి వచ్చాయి.38 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

లింగసముద్రంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు 59వ పోలింగ్ కేంద్రంలో 801 ఓట్లు ఉండగా 716 ఓట్లు పోలయ్యాయి.439 ఓట్లు టిడిపికి 257 ఓట్లు,వైసిపికి వచ్చాయి, 183 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది. 60వ పోలింగ్ బూత్ లో 820 ఓట్లు ఉండగా 720 ఓట్లు పోలయ్యాయి.331 ఓట్లు టిడిపికి,370 ఓట్లు వైసిపికి వచ్చాయి 39 ఓట్లు వైసీపీకి మెజార్టీ దక్కింది.61 పోలింగ్ కేంద్రంలో 1202 ఓట్లు ఉండగా 1031 ఓట్లు పోలయ్యాయి.వీటిలో 670 ఓట్లు టిడిపికి 325 ఓట్లు,వైసిపికి వచ్చాయి 345 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.62వ పోలింగ్ కేంద్రంలో 654 ఓట్లు ఉండగా 534 ఓట్లు పోలయ్యాయి.344 ఓట్లు టిడిపికి,182 ఓట్లు వైసిపికి వచ్చాయి.162 ఓట్లు టిడిపికి మెజార్టీ దక్కింది.63వ పోలింగ్ కేంద్రంలో 489 ఓట్లు ఉండగా 401 ఓట్లు పోలయ్యాయి.236 ఓట్లు టిడిపికి,146 ఓట్లు వైసిపికి వచ్చాయి.90 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది వాకమల్ల వారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన 64వ పోలింగ్ కేంద్రంలో 1226 కోట్లు ఉండగా 1077 ఓట్లు పోలయ్యాయి.436 ఓట్లు టిడిపికి 598 ఓట్లు,వైసిపికి వచ్చాయి.162 ఓట్లు వైసిపి కి మెజార్టీ వచ్చింది.

పెంట్రాల గ్రామంలో ఉన్న 65వ పోలింగ్ కేంద్రంలో 805 ఓట్లు ఉండగా 730 ఓట్లు పోలయ్యాయి. 454 ఓట్లు టిడిపికి 250 ఓట్లు,వైసీపీకి వచ్చాయి. 194 ఓట్లు టిడిపికి మెజార్టీ దక్కింది. రాళ్లపాడు గ్రామంలోని 66వ పోలింగ్ కేంద్రంలో 682 ఓట్లు ఉండగా 628 ఓట్లు పోలయ్యాయి. 249 ఓట్లు టిడిపికి,348 ఓట్లు వైసీపీకి దక్కాయి.ఈ పోలింగ్ కేంద్రంలో 99 ఓట్లు వైసిపికి మెజార్టీ రావడం జరిగింది.

ఆర్ఆర్ పాలెం గ్రామంలోని 67వ పోలింగ్ కేంద్రంలో 724 ఓట్లు ఉండగా 643 ఓట్లు పోలయ్యాయి. 368 కోట్లు టిడిపికి,261 ఓట్లు వైసీపీకి వచ్చాయి.107 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

మొగిలిచర్ల గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.68వ పోలింగ్ కేంద్రంలో 1168 ఓట్లు ఉండగా 1036 ఓట్లు పోలయ్యాయి.624 ఓట్లు టిడిపికి 356 ఓట్లు వైసిపికి వచ్చాయి.268 ఓట్లు టిడిపికి మెజార్టీ రావడం జరిగింది.69వ పోలింగ్ కేంద్రంలో 1183 ఓట్లు ఉండగా 1084 ఓట్లు పోలయ్యాయి.378 ఓట్లు టిడిపికి 653 ఓట్లు వైసిపికి వచ్చాయి.275 ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చింది.

చిన్నపవని గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.70వ పోలింగ్ కేంద్రంలో 903 ఓట్లు ఉండగా 89 ఓట్లు పోలయ్యాయి.575 ఓట్లు టిడిపికి,210 ఓట్లు వైసిపికి వచ్చాయి.365 ఓట్లు టిడిపికి మెజార్టీ దక్కింది.71వ పోలింగ్ కేంద్రంలో 934 ఓట్లు ఉండగా 850 ఓట్లు పోలయ్యాయి.643 ఓట్లు టిడిపికి,184 ఓట్లు వైసీపీకి వచ్చాయి 459 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.72వ పోలింగ్ కేంద్రంలో 595 ఓట్లు ఉండగా 574 ఓట్లు పోలయ్యాయి.329 ఓట్లు టిడిపికి 228 ఓట్లు వైసీపీకి వచ్చాయి.101 ఓటు టిడిపికి మెజార్టీ దక్కింది. సత్యనారాయణపురంలో ఉన్న 73వ పోలింగ్ కేంద్రంలో 324 ఓట్లు ఉండగా 292 ఓట్లు పోలయ్యాయి. 213 ఓట్లు టిడిపికి 74 ఓట్లు,వైసిపికి వచ్చాయి 139 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

అనేబోయినపల్లెలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.74వ పోలింగ్ కేంద్రంలో 929 ఓట్లు ఉండగా 858 ఓట్లు పోలయ్యాయి.362 ఓట్లు టిడిపికి,455 ఓట్లు వైసిపి కి వచ్చాయి.93 ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చింది.75వ పోలింగ్ కేంద్రంలో 927 ఓట్లు ఉండగా 833 ఓట్లు పోలయ్యాయి.443 ఓట్లు టిడిపికి,370 ఓట్లు వైసీపీకి వచ్చాయి.73 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

అంగిరేకులపాడులో ఉన్న 76వ పోలింగ్ కేంద్రంలో 832 ఓట్లు ఉండగా 745 ఓట్లు పోలయ్యాయి. 500 ఓట్లు టిడిపికి,239 ఓట్లు వైసిపి కి వచ్చాయి.261 ఓట్లు టిడిపికి మెజార్టీ రావడం జరిగింది. మేదరమెట్ల పాలెం లో ఉన్న 77వ పోలింగ్ కేంద్రంలో 666 ఓట్లు ఉండగా 615 కోట్లు పోలయ్యాయి.336 ఓట్లు టిడిపికి,272 కోట్లు వైసీపీకి వచ్చాయి.64 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

పెద్దపవని గ్రామంలో ఐదు పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.78వ పోలింగ్ కేంద్రంలో 735 ఓట్లు ఉండగా 654 ఓట్లు పోలయ్యాయి.323 ఓట్లు టిడిపికి,301 ఓట్లు వైసిపికి వచ్చాయి.22 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది..79వ పోలింగ్ కేంద్రంలో 702 ఓట్లు ఉండగా 623 ఓట్లు పోలయ్యాయి.311 ఓట్లు టిడిపికి,289 ఓట్లు వైసీపీకి వచ్చాయి.22 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.80వ పోలింగ్ కేంద్రంలో 605 ఓట్లు ఉండగా 534 ఓట్లు పోలయ్యాయి.297 ఓట్లు టిడిపికి,225 ఓట్లు వైసిపికి వచ్చాయి.72 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది 81వ పోలింగ్ కేంద్రంలో 682 ఓట్లు ఉండగా 576 ఓట్లు పోలయ్యాయి.355 ఓట్లు టిడిపికి,197 ఓట్లు వైసిపి కి వచ్చాయి.158 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.82వ పోలింగ్ కేంద్రంలో 1094 ఓట్లు ఉండగా 999 ఓట్లు పోలయ్యాయి.555 ఓట్లు టిడిపికి 383 ఓట్లు వైసీపీకి వచ్చాయి.172 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.

ముత్యాలపాడులో 83వ పోలింగ్ కేంద్రంలో 1046 ఓట్లు ఉండగా 945 ఓట్లు పోలయ్యాయి.468 ఓట్లు టిడ ిపికి,453 ఓట్లు వైసీపీకి వచ్చాయి.15 ఓట్లు టిడిపికి మెజార్టీ వచ్చింది.84వ పోలింగ్ కేంద్రాన్ని ముత్తం వారి పాలెం గ్రామంలో ఏర్పాటు చేశారు.676 ఓట్లు ఉండగా 612 ఓట్లు పోలయ్యాయి.260 ఓట్లు టిడిపికి 349 ఓట్లు,వైసీపీకి వచ్చాయి.89 ఓట్లు వైసిపి కి మెజార్టీ రావడం జరిగింది.

ఓటేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

లింగసముద్రం అభివృద్ధికి కృషి
-అడపా రంగయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు

ప్రజాశక్తి-లింగసముద్రం

కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో లింగసముద్రం పంచాయతీ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మం డల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్ని కల్లో తెలుగుదేశం పార్టీ నాయ కులు కార్యకర్తలు లింగ సముద్రం పంచా యతీలో సమన్వ యంతో కలిసి కట్టుగా పనిచేసి పంచా యతీలో గతంలో ఎన్నడూ లేని విధం గా పార్టీకి భారీ మెజార్టీ తీసుకు రావడ ంలో కృషి చేశారన్నారు.ఊహించిన దానికంటే ఎక్కువ మెజార్టీ రావడంతో శాసనసభ్యులు కూడా లింగసముద్రం పంచాయతీలోని నాయకులను ప్రత్యేకంగా అభినందించినట్లు తెలియజేశారు. ఇదేవిధంగా రానున్న రోజుల్లో పనిచేసి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందరికీ అందజేస్తూ పంచాయతీ అభివద్ధికి కషి చేయడం జరుగుతుందన్నారు. గత పాలనలో గ్రామాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ముఖ్యం గా పార్టీ అభివృద్ధికి పని చేయడంతో పాటు కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి దోహదపడేలా పనిచేయడం జరుగుతుందని చెప్పారు. శాసనసభ్యులు నాగేశ్వరరావు సహకారంతో గ్రామంలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి ఒక్కొక్కటి పరిష్కరించుకునే విధంగా ముందుకు వెళ్లడం జరుగుతుందని వివరించారు. పంచాయతీలోని నాయకులు సూచనలు సలహాలతో వాళ్ల అనుభవాలను తీసుకొని పనిచేయడం జరుగుతుందని తెలిపారు.

అడపా రంగయ్య

మండల అభివృద్ధికి కృషి
-టిడిపి అధ్యక్షులు వేముల

ప్రజాశక్తి-లింగసముద్రం

లింగసముద్రం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించే దిశగా రానున్న ఐదేళ్ల పనిచేయడం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు చెప్పారు.మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు మండలంలో ముఖ్యంగా రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా మన్నేరు ప్రాంత గ్రామాల రైతులు వ్యవసాయం చేస్తుంటారని వర్షాలు మీద ఆధారపడి ఉన్న ప్రాజెక్టుకు సోమశిల జలాలను క్రమం తప్పకుండా తీసుకువచ్చే విధంగా తగిన చర్యలు తీసుకునేలా చూడడం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం గతంలో ప్రాజెక్టు నిర్వహణ అస్తవస్తంగా ఉండేదని నిధులు కూడా విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరిగిందన్నారు. గేట్లు మరమ్మతులు కూడా చేయలేదని రైతులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు కూడా రాళ్లపాడు ప్రాజెక్టుపై శాసనసభ్యులు నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టేలా చూస్తామన్నారు.ఎమ్మెల్యే సహకారంతో మండలంలో తాగు, సాగునీరు అందేలా చూస్తామన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు శక్తికి మించి పని చేశారని సమన్వయంతో ముందుకు వెళ్లి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సుమారు 3000 మెజార్టీ తీసుకురావడం జరిగిందన్నారు. బలమైన క్యాడర్ కలిగిన తెలుగుదేశం పార్టీ లింగసముద్రం మండలంలో ఒకటి రెండు గ్రామాలు తప్ప అన్ని గ్రామాల్లో మంచి మెజార్టీ తీసుకురావడంలో సఫలీకృతులయ్యారని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని ముఖ్యంగా మండలంలో రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.గ్రామాల్లో అంతర్గత రోడ్డు నిర్మాణానికి గ్రామ పార్టీ నాయకులతో చర్చించి పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

వేముల గోపాల్‌రావు

ఎడమ కాలువ పనులు ప్రారంభించాలి

టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు చిరుమామిళ్ల బ్రహ్మయ్య

ప్రజాశక్తి-లింగసముద్రం

గత పది సంవత్సరాల నుంచి ముందుకు సాగని రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులు పూర్తిచేసేలా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ పెడతారని తెలుగుదేశం పార్టీ మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు చిరుమామిళ్ల బ్రహ్మయ్య అన్నారు. భూసేకరణ పూర్తయినా కానీ కాలువ పొడగింపు పనులు ప్రారంభించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించినట్లు విమర్శలు ఉన్నాయి. రైతులు ఎన్నో రోజుల నుంచి కాలువ పొడగింపు పనులు మొదలు పెడతారని ఆశ ఎదురుచూసిన ఎలాంటి ఫలితమూ లేదు. గతంలో ఈ కాలువ కోసం నిధులు మంజూరు చేశారు. కాలువ పొడగింపు చేయడం వల్ల గంగపాలెం విశ్వనాథపురం కలవల్ల నందలపూరు తదితర గ్రామాలు రైతులకు మేలు చేకూరుతుందని తద్వారా మాగాణి పంటలు సాగు చేసుకునే అవకాశం ఉం టుంద న్నారు. పొడగింపు పనుల గురించి శాసన సభ్యులు ఇం టూరి నాగేశ్వరరావు తో చర్చి ంచి త్వరి తగతిన పన ులు వెంు ద లు పెట్టే లా చర్యలు తీసుకో వాలని కోరడం జరుగుతుందని తెలిపారు.

చిరుమామిళ్ల బ్రహ్మయ్య

కందుకూరు సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అడుగులు

- రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి
- ప్రజాశక్తితో కందుకూరు ఎంఎల్ఎ 'ఇంటూరి'

పార్టీ కార్యాలయంలో నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - లింగసముద్రం

కందుకూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అందరి సలహాలు, సూచనలు, అధికారుల సహకారంతో అడుగులు వేస్తున్నామని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ గెలుపుతో ప్రస్తుతం రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే ఇంటూరి వ్యాఖ్యానించారు. కందుకూరు ఎమ్మెల్యేగా రాష్ట్ర శాసనసభలో పదవీ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కందుకూరు క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాశక్తి కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన మనోభావాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఘన విజయంతో అనుభవజ్ఞులైన నాయకుడు నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు నాయకత్వంలోని మంత్రివర్గం, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఇంటూరి స్పష్టం చేశారు. అదే కోవలో కందుకూరు సమగ్రాభివృద్ధికి నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, అధికారుల సలహాలు, సూచనలతో కందుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికా బద్ధంగా ముందడుగులు వేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో కందుకూరు సమగ్రాభివద్ధి ఎలా సాధ్యమో ఆయన మాటల్లోనే...

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

మెట్ట ప్రాంతమైన కందుకూరులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు పేర్కొన్నారు. కందుకూరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి రైతులకు అవసరమైన అన్ని పంటల విత్తనాలు, యాంత్రిక పనిముట్లు, వ్యవసాయ పరికరాలను సబ్సిడీ ద్వారా సరఫరా చేయడంతో పాటు రైతులు తమ పంటలను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గిడ్డంగుల నిర్మాణం, పంటల గిట్టుబాటు ధరల కోసం కందుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అన్ని వసతులను రైతులకు కల్పిస్తామని చెప్పారు.

రాళ్లపాడు ప్రాజెక్టు నీటి సాధనకు కృషి

సోమశిల రిజర్వాయర్ నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువకు నీటి సాధన ఎన్నో ఏళ్లుగా అటకెక్కిందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. సోమశిల నుంచి రావాల్సిన 1.5 టిఎంసిల నీటి సాధన సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఉదయగిరి ఎమ్మెల్యే సహకారంతో రాళ్లపాడుకు నీరు తెస్తానన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. దీనివల్ల ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వం రాళ్లపాడు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే విమర్శించారు. రాళ్లపాడు అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోగా కనీసం ప్రాజెక్టు నిర్వహణకు కూడా నిధులు ఇవ్వని పరిస్థితిని మనం అందరమూ చూశామని చెప్పారు. ఈ సమస్యపై ఇరిగేషన్ అధికారులతో చర్చించి రాళ్లపాడుతో పాటు ఇతర ఇరిగేషన్ ట్యాంకులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన ఫస్ట్ ఫేజ్ లోనే తీసుకొచ్చి రైతాంగానికి సాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ప్రాజెక్టులో కనీసంగా 10 అడుగుల మేర నీరు నిల్వ ఉంటేనే సమస్య లేకుండా ఉంటుందని, ఈ నేపథ్యంలో చేపల వేట కూడా లేకుండా అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. అదేవిధంగా రాళ్లపాడు-రోళ్లపాడు పథకం కింద ప్రాజెక్టు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన దాదాపు లక్ష మంది ప్రజలు తాగునీటికోసం ఈ ప్రాజెక్టు పైనే ఆధారపడి ఉన్నారన్నారు. ఈ పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తెచ్చి రాళ్లపాడు ప్రాజెక్టు పరిసర గ్రామీణ ప్రజలకు తాగునీటి సమస్య కూడా లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంఐజి లే అవుట్ నివాసయోగ్యం కాదు. కందుకూరులో ఏర్పాటు చేసిన ఎంఐజి లే అవుట్ నివాసయోగ్యం కాదని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ లేఅవుట్‌లో నివాసం కోసం ఇప్పటికే అనేకమంది మున్సిపల్ కార్యాలయంలో అడ్వాన్సులు ఇచ్చి ఉన్నట్లు చెప్పారు. ఎంఐజి లేఅవుట్‌ను న్యాయ నిపుణుల సలహాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడుతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే ఇంటూరి స్పష్టం చేశారు. కందుకూరును మూడంచెల భద్రతతో కాపాడుతానని ఇప్పటికే తాను మీడియా సమావేశంలో చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు.

ఇంటూరిని అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్

ఉపాధి అవకాశాలతో వలసల నిర్మూలన

కందుకూరు నియోజకవర్గంలోని వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని వలసలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధిని మెరుగుపరిచేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని, రామాయపట్నం పోర్టు ఆధారిత పరిశ్రమలు తేవడంతో పాటు నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా యువత అర్హత ఆధారంగా పూర్తిస్థాయిలో వారికి ఉపాధిని కల్పించి వలసల నిర్మూలన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల విషయంలో తమ వారైనా ఉపేక్షించేది లేదు..

రెచ్చగొట్టు ధోరణితో.. అది తమ వారైనా సరే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఇంటూరి హెచ్చరించారు. ఈ విషయమై ఇప్పటికే డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కందుకూరులోని వ్యాపారులు వారి వ్యాపారాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అన్ని విధాలా వారికి అండదండలు అందిస్తానని ఇంటూరి భరోసా ఇచ్చారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కందుకూరు పట్టణానికి బైపాస్ రోడ్డును వేగవంతంగా పూర్తి చేసి పట్టణ పరిధిలోని అన్ని రహదారులను నిర్మించి జాతీయ రహదారికి వాటిని అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

కందుకూరు డివిజన్ పోలీసు అధికారులతో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

'మాలకొండ'లో యాత్రికుల సందడి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండలో ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుంచి వివిధ రూపాల ద్వారా రూ1098753 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా 3372 మంది భక్తులు దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,10575 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.ఆలయ అర్చకులు గౌరి శంకర్, నసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు



ఉప్పుటేరుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి

– వర్షాకాలంలో ఉప్పుటేరు బ్రిడ్జి పొంగి రాకపోకలకు అంతరాయం – పెద్దపవని గ్రామస్తుల కల నెరవేరేనా..

ఉప్పుటేరుపై ఉన్న బ్రిడ్జి

ప్రజాశక్తి - లింగసముద్రం

వర్షాకాలంలో ఉప్పుటేరు ఉప్పొంగి తరచూ ప్రమాదాలకు కారణమవుతూన్న పెద్దపవని గ్రామ సమీపంలోని ఉప్పుటేరుపై హై లెవెల్ వంతెన మంజూరు చేయాలని పెద్దపవని గ్రామస్తులు కోరుకుంటున్నారు. వర్షాకాలంలో వానలు పడినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి ఉప్పుటేరులోకి నీరు రావడంతో ఇప్పుడు ఉన్న బ్రిడ్జి పైన సుమారు ఐదు నుంచి పది అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేది. ఆ సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అదే సమయంలో వారు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టి సాధ్యమైనంత త్వరగా వంతెన మంజూరయ్యేలా చూడాలన్నారు.గతంలో ఈ సమస్య గురించి గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పుటేరు దాటి వెళ్లాలంటే వర్షాకాలం ఏ సమయంలో బ్రిడ్జి మీదకు నీళ్లు వస్తాయో అని ఆందోళనతో వాహన చోదకులు ఉంటున్నారు.గతంలో విపరీతంగా కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జిని దాటుతున్న సమయంలో నీటి ప్రవాహానికి ఆటో ఉప్పుటేరులోకి కొట్టుకుపోవడం వల్ల వ్యక్తి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలంటే హై లెవెల్ వంతెన నిర్మాణం తప్ప మరో మార్గం లేదన్నారు. వంతెన నిర్మాణం జరిగి కొన్ని సంవత్సరాలు జరుగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండడంవల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని నామమాత్రపు మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారననే విమర్శలు ఉన్నాయి. వర్షాకాల సమయంలో ఉప్పుటేరులోకి నీటి ప్రవాహం వస్తుందని తెలుసుకున్న అధికారులు వంతెనకు రెండువైపులా పోలీస్ ద్వారా కాపలా పెట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు నేటి ప్రవాహం తగ్గేవరకు రాకపోకలు నిలిపివేసి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులు లేకుండా ఉండాలంటే తక్షణమే ఉప్పుటేరుపై వంతెన నిర్మాణానికి ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఉప్పుటేరు బ్రిడ్జిపై వర్షాకాలం నీళ్ల ప్రవహించి నప్పుడు పెద్దపవని గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి ఉధతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు ప్రవాహం తగ్గిన తర్వాతనే తిరిగి రాకపోకలను ఉప్పుటేరు బ్రిడ్జిపై అనుమతి స్తున్నారు. పెద్దపవని గ్రామస్తులు ఎప్పటినుండో ఎదురుచూస్తున్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వారి సమస్యను పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్రిడ్జి మీద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు



ఇంటూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజారపు మాలకొండయ్య

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి కృషి

- రాజారపు మాలకొండయ్య

ప్రజాశక్తి - లింగసముద్రం

కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను 20 సంవత్సరాల తర్వాత ఎన్నికల్లో విజయం సాధించే విధంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని ఎల్లారెడ్డి పాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్య అన్నారు. నాలుగు ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు వరుసగా ఓటమి చెబుతున్నప్పటికీ కార్యకర్తలు నిరుత్సాహపడకుండా ఈసారి ఎలాగైనా కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండాను రెపరెపలాడించాలని, కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును శాసనసభ్యులుగా గెలిపించుకోవాలని చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆయన గెలుపు కోసం లింగసముద్రం మండలంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కలిసికట్టుగా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేశారన్నారు. శాసనసభ్యులు సహకారంతో ఎర్రరెడ్డిపాలెం గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, పార్టీ అభివృద్ధికి దోహదపడడం జరుగుతుందని తెలిపారు.

గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎంఎల్ఎ హామీ

గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర గ్రామాల నుంచి ఆటోలో వచ్చి మినరల్ వాటర్ ను గ్రామస్తులకు అమ్ముతున్నారు. గ్రామంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో మాట్లాడి వాటర్ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వాటర్ ప్లాంట్ లేకపోవడంతో కొందరు వెంగలాపురం లింగసముద్రం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. త్వరలోనే గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేస్తామన్నారు.

అందరి సహకారంతో టిడిపికి భారీ మెజార్టీ

- గొర్రెపాటి సాంబయ్య

ప్రజాశక్తి - లింగసముద్రం

బలమైన క్యాడర్ ఎంతోమంది నాయకులు ఉన్నప్పటికీ గ్రామంలో సరైన నాయకత్వం లేక పోవడంతో నిరుత్సాహంగా ఉన్న క్యాడర్ కు అన్ని తానై నిలిచారు.గ్రామంలో ఉన్న పార్టీ బలాన్ని గుర్తించి వారందరినీ ఒక తాటి మీదకి తెచ్చేందుకు కృషి చేయడంలో సఫలీకృతుల య్యారు. పెద్దపవని గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి సాంబయ్య. గ్రామ పార్టీ అధ్యక్షులుగా బాధితులు స్వీకరించినప్పటి నుండి గ్రామంలో అన్ని వర్గాల వారిని కలుపుకొని పార్టీ కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్లారు.ముఖ్యంగా బలహీనవర్గాల్లో పార్టీని నింపేందుకు ఆయన కృషి ప్రశంసనీయం.అధికారం ఉన్నప్పుడు అందరూ నాయకులుగా ముందుకొచ్చి అధిష్టానం దగ్గర మన్ననలు పొందారు.అధికారం లేనప్పుడు పార్టీ కోసం సాంబయ్య చేసిన కృషి ఎనలేనిది.సార్వత్రిక ఎన్నికలకు ముందు బలమైన ప్రణాళికలతో ముందుకు వెళుతూ కార్యకర్తలను నాయకులను సమన్వయ పరుచుకుంటూ పార్టీకి పట్టు తీసుకొచ్చారు.ఎన్నికల సమయంలో ఆయన రచించిన ప్రణాళికలు మంచి ఫలితాలొచ్చాయి అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. గత ఎన్నికల్లో ఇదే పంచాయతీలో ఆరు వందల పైచిలుకు మెజార్టీ వైసీపీ పార్టీకి వచ్చాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు అన్నట్టుగా పెద్దపవని గ్రామంలో 446 ఓట్లు మెజార్టీ తీసుకొచ్చి పార్టీకి బలమైన క్యాడర్ ఉందని సాంబయ్య నిరూపించారు.ఎన్నికల సమయంలో పార్టీలో ఎక్కడ వ్యతిరేకత రాకుండా అందరి నాయకులను కలుపుకొని ముందుకు వెళ్లడం జరిగింది. ప్రాంతాల్లో ఉన్న ఓట్లను గుర్తించడం వారిని ఓటు వేయడానికి తీసుకురావడంలో సాంబయ్య పనితీరుకు అద్దం పడుతుంది. మేజర్ పంచాయతీ అయినా పెద్ద పనులు కులాలవారీగా పనులు అప్పజెప్పి వారి చేత పనులు పూర్తి చేయించేలా చేయడంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకతను అన్ని వర్గాల్లోకి తీసుకెళ్లడంలో విజయం సాధించారు.కందుకూరు నియోజకవర్గంలో 20 సంవత్సరాల తర్వాత తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు గెలుపొందారు. శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో ఆయన అండదండలతో పెద్ద పవని గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని సాంబయ్య చెబుతున్నారు. అదేవిధంగా పార్టీని బలోపితం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు ప్రభుత్వ పథకాలన్నీ అర్హులైన వారికి అందేలా చూడడం జరుగు తుందని తెలియజేశారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి న్యాయం చేశానని భావిస్తున్నట్లు సాంబయ్య చెప్పారు.

లింగసముద్రంలో రోడ్డు విస్తరణ జరిగేనా..!

- జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికేనా
- ఓవైపు ట్రాఫిక్ సమస్య - మరోవైపు రోడ్డు ఆక్రమణలు
- శాసనసభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి-లింగసముద్రం

మండల కేంద్రమైన లింగసముద్రంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు,వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ అంతరాయం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రోజురోజుకీ ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతున్నాయే తప్ప ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాలకులు అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది.ఇంత పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య లింగసముద్రంలో ఉన్నప్పటికీ ఆ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు కానీ పనిచేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు మార్జిన్ల ఆక్రమణ

లింగసముద్రంలో కృష్ణమోహన్ ఆస్పత్రి నుంచి తిరుమల శెట్టి కోటయ్య సమాధి మీదుగా బాలాజీ థియేటర్ వరకు రోడ్డుకు రెండు వైపులా మార్జిన్ లను ఆక్రమించుకొని ఉండడంవల్ల వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించు కోవడంతో పాటు ఎత్తుగా మట్టి పోయడం వల్ల రోడ్డుకు ఇరువైపులా ఇదే పరిస్థితి ఉండడంతో రోడ్డు చిన్నగా మారి రెండు వాహనాలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తుతుంది. మార్జిన్ ఆక్రమణలను తొలగించేందుకు ఆర్ అండ్ బి అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.దీంతో ఎవరికి నచ్చినట్టు వారు రోడ్డు మార్జిన్ లను ఆక్రమించుకోవడం జరిగింది. దుకాణాల ముందు వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతూ వస్తుంది.తక్షణమే రోడ్డు మార్జిన్ల ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు జరిగేనా..?

వలేటివారిపాలెం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు వరకు ఉన్న రోడ్డు గతంలో జిల్లా పరిషత్‌లో ఉండేది. 2019 కి ముందు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ రోడ్డును అప్పటి రోడ్డు భవనాల శాఖ మంత్రి సిద్ద రాఘవరావు సహకారంతో ఆర్ అండ్‌బి రోడ్డుగా మార్చడం జరిగింది. రోడ్డు విస్తరణ పనులకు జిల్లా పరిషత్ రోడ్డు కావడంతో ఆటంకం ఏర్పడిందని అప్పట్లో కొందరు ప్రజాప్రతినిధులు ఆర్ అండ్ బి రోడ్డు గా మార్చడానికి చర్యలు తీసుకోవడం జరిగింది. ఆర్ అండ్ బి రోడ్డుగా మారిన తర్వాత ఎలాంటి విస్తరణ పనులు గాని రోడ్డు అభివృద్ధి పనులు గాని చేపట్టకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణానికి పాలకులు గానీ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనులకు ఐదు సంవత్సరాలు పాటు లింగసముద్రం గ్రామస్తులతో పాటు వాహన చోదకులు ప్రయాణికులు ఆశగా ఎదురు చూశారు. రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగలేదు. దీంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతూ ఉంది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.చిన్న చిన్న గ్రామాలలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు మండల కేంద్రంలో మాత్రం ఎందుకు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత ఐదు సంవత్సరాలు రోడ్డు నిర్మాణానికి గాని ఆక్రమణ తొలగింపుగాని చర్యలు తీసుకుని ఉండి ఉంటే ట్రాఫిక్ సమస్య ఇంత తీవ్రంగా ఉండేది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రెండు బస్సులు రావడంతో నిలిచిన ట్రాఫిక్

ట్రాఫిక్ సమస్య తీరేనా..?

లింగసముద్రంలో ట్రాఫిక్ సమస్య ఎప్పుడు తీరుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. లింగసముద్రానికి నిత్యం కందుకూరు,కావలి,నెల్లూరు డిపో నుంచి ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి.ఆర్టీసీ బస్సులు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్యతో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత ప్రభుత్వంలో వలేటివారి పాలెం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు వరకు రోడ్డు విస్తరణ చేపట్టి డబల్ రోడ్డు వేయడం జరుగుతుందని పలు సందర్భాల్లో మాజీ శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి చెప్పారు. కానీ ఎక్కడ కూడా కార్యరూపం దాల్చకపోవడంతో ట్రాఫిక్ సమస్య అలాగే ఉండిపోవడంతో పాటు రోజురోజుకు పెరుగుతూ ఉంది.

నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ చేపట్టి రోడ్డు ఆక్రమణలు తొలగించి లింగసముద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని లింగసముద్రం ప్రజలు కోరుతున్నారు.

సమస్యలకు నిలయంగా సంక్షేమ వసతి గృహాలు..!

- పెచ్చులూడుతున్న శ్లాబు, రూములు.
- తలుపులు లేని గదులు.
- ఇరుకుగా కూర్చొంటున్న విద్యార్థులు.
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు.
- శ్రద్ధ చూపని ఉన్నతాధికారులు.

సంక్షేమ వసతి గృహం

కూలిన హాస్టల్ ప్రహరీ గోడ

ప్రజాశక్తి - లింగసముద్రం

మండల కేంద్రమైన లింగసముద్రంలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిల యంగా మారాయి. సమస్యల మధ్యలోనే విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతాధి కారులు గాని ప్రజా ప్రతినిధులు గాని ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం పై విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువులు కొనసాగిస్తున్న విద్యార్థులు అన్నీ వసతులు ఉంటాయని వారి తల్లిదండ్రులును వదిలి వస్తుంటారు.ఇక్కడ మాత్రం అసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. లింగసముద్రంలో మూడు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి.ఒక్కొక్క వసతి గృహంలో 100కు పైగా విద్యార్థులు ఉండేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడం జరిగింది.బిసి బాలికల సంక్షేమ వసతి గృహం, బిసి బాలుర సంక్షేమ వసతి గృహం,ఎస్‌సి బాలుర వసతి గృహం ఈ మూడు సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

అధ్వానంగా బిసి హాస్టళ్లలో రూములు

బిసి బాలుర వసతి గృహంలో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. విద్యార్థులు సమస్యల మధ్యలోనే చదువులు కొనసాగిస్తున్నారు. వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు శ్లాబు పెచ్చులూడి కింద పడడంతో విద్యార్థులు భయంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి ఈ విధంగా సమస్యలు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు ఈ సమస్యల గురించి వసతి గృహం అధికారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చర్యలు తీసుకోకపోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. రూముల్లో శ్లాబ్ పెచ్చులు పడిపోవడంతో ఆ రూముల్లోకి విద్యార్థులను వెళ్లనీయకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుం టున్నారు.ఎక్కువ రూముల్లో ఈ విధంగా ఉండటంవల్ల విద్యార్థులు మిగిలిన రూముల్లో ఇరికిరుకుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకే రూములో ఏడు మంచాలు వేసి విద్యార్థులను ఉంచుతున్నారు. దీనిని బట్టి చూస్తే హాస్టళ్లలో సమస్యలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.రూములకు తలుపులు లేకపోవడంతో విద్యార్థుల సామాన్లకు భద్రత లేకుండా పోతుంది.తలుపులు ఏర్పాటు చేయడంలో కూడా విఫలం చెందినట్లు అర్థమవుతుంది.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి

ఎస్సీ హాస్టల్లో ప్రహరీ గోడ పడిపోవడం వల్ల హాస్టల్లోకి పశువులు రావడం జరుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ గోడ పడిపోయి చాలా రోజులు గడుస్తున్నా నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎస్సీ హాస్టల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. వసతి గృహంలో సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు హాస్టళ్లకు దూరమవుతున్నారు. ఇక్కడ ఉన్న పరిస్థితులు చూసి విద్యార్థులు తల్లిదండ్రులు వారిని పంపించేందుకు ఆసక్తి చూపడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి.

బాలికల వస్తే గృహంలో సమస్యలను పరిష్కరించండి

బీసీ బాలికల వసతి గృహంలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. బాలికల వసతి గృహంలో ఉన్న సమస్యల గురించి అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహంలో చేరేందుకు కొత్త విద్యార్థులు వస్తుంటారు. అక్కడున్న పరిస్థితులను, సమస్యలను చూసి తిరిగి వెళ్లిపోకుండా వారు వసతి గృహంలోనే ఉండి చదువుకునే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వస్తు గృహాల్లో ఉన్న సమస్యల గురించి ఎప్పటికప్పుడు వసతి గృహాల అధికారులు తెలియజేస్తున్నా చర్యలు తీసుకోవడంలో గాని మరమ్మతులు చేయించడంలో గాని ఉన్నతాధికారులు సకాలంలో స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మూడు వసతి గృహాల్లోని సమస్యలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించడంతో పాటు శిథిలావస్థలో చేరిన రూములను తొలగించి కొత్త వాటిని నిర్మించేలా నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఇరుకుగా ఉన్న బెడ్ మంచాలు



పెచ్చులూడిన శ్లాబు

కందుకూరు భవిష్యత్తుకు ఆశాకిరణం 'ఇంటూరి'